ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
7
గురువారం 11 డిసెంబరు 2025



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాధిక

సొసైటీ బ్యాంకుల్లో బంగారు బురిడీ..!



మదనపల్లె సొసైటీ బ్యాంకు

- నకిలీ, మకిలీలతో కస్టమర్లకు రుణాలు
- డీసీసీబీ రీఅప్రైజింగ్‌తో వెలుగులోకి..
- నిత్యం జరుగుతున్నా చర్యలు శూన్యం
- మొన్న తంబళ్లపల్లె, నిన్న చిన్నగొట్టిగల్లు
- తాజాగా.. మదనపల్లె, నిమ్మనపల్లెలలో..



నిమ్మనపల్లెలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘు కార్యాలయం

మదనపల్లె, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (సింగిల్‌విండోలు) ఈ పేరు వినగానే రైతులు, పేద, మధ్య తరగతి ప్రజలకు స్థానికంగా అందుబాటులో ఉండే బ్యాంకులు. ఇక్కడ పంట రుణాలతో పాటు ఎరువులు, విత్తనాలు, కొన్నిచోట్ల వ్యాపార, బంగారంపై రుణాలు ఇస్తున్నాయి. బేసిక్‌గా సింగిల్‌విండోలు రైతు శ్రేయస్సు కోసం పంట రుణాలు ఎక్కువగా ఇస్తుంటాయి. వాటిని తిరిగి రైతుల నుంచి రికవరీ చేయడంలో సీఈవో, సిబ్బంది అక్రమాలకు పాల్పడిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. మరెన్నో కేసులు నమోదయ్యాయి. అక్రమాలపై విచారణలు ఇప్పటికీ పెండింగ్‌లో ఉండగా, మరికొన్ని సొసైటీల్లో చార్జెస్ నమోదు కాగా, ఇంకొన్ని సొసైటీలలో ఈపీలు కూడా ఫైల్ అయ్యాయి. ఇదిలా ఉండగా కొన్ని సొసైటీలలో సేవలు, వ్యాపారాన్ని విస్తరించే క్రమంలో డీసీసీబీ ద్వారా బంగారు రుణాలు కూడా ఇస్తున్నారు. ఇక్కడా కొందరు సొసైటీ సీఈవోలు బ్యాంకు అప్రైజర్లతో చేతులు కలిపి అక్రమాలకు పాల్పడుతుండగా మరికొన్ని చోట్ల సీఈవోలతో ప్రమేయం లేకుండా కస్టమర్లతో మాట్లాడుకుని అప్రైజర్లే అవినీతి, అక్రమాలకు తెర లేపుతున్నారు. ఈ క్రమంలో ఎక్కడో ఒకచోట ఇలాంటి ఉదంతం బయట పడితే కానీ అధికారులు పట్టించుకోవడం లేదు. అక్రమాన్ని సరిచేయడం, నిందితుల నుంచి రికవరీ చేయడంతోనే చర్యలు లేకుండా సరిపెట్టుకోవడంతో ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నట్లు సహకార శాఖాధికారులు వాపోతున్నారు. సొసైటీల్లో మితిమీరిన రాజకీయ జోక్యం, సహకార చట్టంలోని లొసుగులూ ప్రధాన కారణంగా చెబుతున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 76 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (సింగిల్‌విండోలు) ఉన్నాయి. వీటిలో దాదాపు 40 సొసైటీలు సేవల విస్తరణ, వ్యాపారాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని బంగారంపై రుణాలు ఇస్తున్నాయి. ఇక్కడే అక్రమాలకు తెరలేపుతున్నారు. నకిలీ బంగారు, టచ్ తక్కువగా ఉన్నా, అసలు బంగారమే లేకపోయినా ప్యాకెట్లు పెట్టి రుణాలు మంజూరు చేస్తున్నారు. ఇందులో కొన్ని చోట్ల రాజకీయ నాయకులు, మరికొన్నిచోట్ల సీఈవోలు, ఇంకొన్ని చోట్ల అప్రైజర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రధానంగా ప్రభుత్వ, ప్రైవేటు, కమర్షియల్, సొసైటీ.. ఇలా బ్యాంకు ఏదైనా బంగారం వ్యాపారమంతా అప్రైజర్‌పై ఆధారపడి ఉంటుంది. సొసైటీలోని రాజకీయ నాయకులు, బ్యాంకు సీఈవో ఇలా ఎవరు ముందుకొచ్చినా అతను నిక్కచ్చిగా ఉంటే అక్రమాలకు ఆస్కారమే ఉండదు. అవినీతికి అంతకంటే అవకాశమే లేదు. కానీ ఇప్పటికీ నిత్యం ఎక్కడో చోట అక్రమాలు బయటకు వస్తున్నాయంటే మరి దీనిని ఏమనాలి. ఎక్కడ పొరపాటు ఉన్నట్లు చెప్పాలి?. ఎవరు బాధ్యత వహించాలనే అంశంపై ఆ శాఖాధికారులు దృష్టి పెట్టడం లేదు. ఇలాంటి కీలకమైన అప్రైజర్ ఎంపికలో అధికారులు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదనే వాదన ఆ శాఖలో గట్టిగా వినిపిస్తోంది.

ఇటీవల తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు సొసైటీలో టచ్ తక్కువగా ఉన్న బంగారాన్ని పెట్టి రుణాలు కాజేశారు. ఇలా రూ.35 లక్షల మేర అక్రమాలు జరిగినట్లు అధికారుల విచారణలో వెలుగులోకి వచ్చింది. అక్కడ పనిచేసే అప్రైజర్ సూత్రధారిగా, సీఈవో పాత్రధారిగా గుర్తించారు. రెండు నెలలు శ్రమించి.. కస్టమర్ల నుంచి అతికష్టం మీద రికవరీ చేశారు. అయితే ఇప్పటికీ ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. చిన్నగొట్టిగల్లు సొసైటీలో నకిలీ బంగారంతో కొన్ని, అసలు బంగారమే లేకుండా మరికొన్ని కస్టమర్ల పేరుతో రుణాలు ఇచ్చినట్లు బయటపడింది. ఇలా రూ.కోటికిపైగా కొట్టేసినట్లు చెబుతున్నారు. ఈ సంఘటన జరిగిన రెండు నెలలు కూడా జరగకముందే రాజకీయ నాయకుల జోక్యంతో మరోసారి పునరావృతమైనట్లు ఆ శాఖలో చర్చ నడుస్తోంది. ఈ విషయం వెలుగులోకి రావడంతో ఆలస్యంగా మేల్కొన్న జిల్లా అధికారులు బ్యాంకు ఆధ్వర్యంలో రీఅప్రైజింగ్‌కు (తాకట్టులోని బంగారు నగల తనిఖీ) తనిఖీలు చేపట్టారు. ఇలా వారం రోజులుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బంగారు రుణాలు మంజూరు చేసిన సొసైటీల్లో ఈ ప్రక్రియ చేపడుతున్నారు. ఇందులో భాగంగా మదనపల్లె డీసీసీబీ బ్రాంచ్ పరిధిలోని మదనపల్లె, నిమ్మనపల్లె సొసైటీలలోనూ గుర్తించారు. అయితే ఇక్కడ టచ్ తక్కువగా ఉన్న బంగారం పెట్టి రుణం తీసుకున్నారు. ఇలా రెండు సొసైటీలలో మూడు నుంచి నలుగురు కస్టమర్ల నుంచి రూ.12 లక్షల చొప్పున తేడా ఉన్నట్లు గుర్తించారు. అయితే ఇక్కడ సీఈవోల పాత్ర లేకపోయినా అప్రైజర్ల ప్రమేయం ఉన్నట్లు చెబుతున్నారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో గుట్టుచప్పుడు కాకుండా ఈ రెండు సొసైటీల్లో మొత్తం రూ.24 లక్షలు మేర వెనక్కి కట్టేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అప్రైజర్‌ను సొసైటీ సీఈవోల నియామకంలో నిబంధనలకు విరుద్ధంగా నియమించుకుంటున్నారు. ఇలా మూడు సొసైటీల్లో మాత్రమే వెలుగులోకి రాగా, జిల్లా వ్యాప్తంగా బయటకు రానివి మరెన్నో ఉన్నట్లు చెబుతున్నారు. ఈ అంశంపై డీసీసీబీ సీఈవో శంకర్‌బాబు వివరణకు ప్రయత్నించగా ఆయన ఫోన్‌కు, మెసేజ్‌కు స్పందించలేదు.

నకిలీ మద్యం కేసులో అన్బురాసు అరెస్టు

- తంబళ్లపల్లె కోర్టులో హాజరు.. 14 రోజుల రిమాండ్



తంబళ్లపల్లె కోర్టులో నిందితుడు అన్బురాసు



అన్బురాసు (ఫైల్)

ములకలచెరువు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు నకిలీ మద్యం కేసులో మరో కీలక అరెస్టు జరిగింది. టీడీపీ నుంచి సస్పెండైన దాసరిపల్లి జయంద్రారెడ్డి ఇంట్లో పనిచేస్తూ లావాదేవీలు చూసిన అన్బురాసు అలియాస్ బాబు (ఏ19)ను అరెస్టు చేశారు. బెంగళూరులో అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు మదనపల్లె ఎక్సైజ్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. అనంతరం బుధవారం రాత్రి తంబళ్లపల్లె జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. దీంతో జడ్జి ఉమర్ ఫరూక్ 14 రోజులు రిమాండ్‌కు విధించడంతో మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు. కాగా ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారానికి సంబంధించి ఎక్సైజ్ పోలీసులు మొత్తం 33 మందిపై కేసు నమోదు చేశారు. ఇప్పటి వరకు 31 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇంక మిగిలిన ఇద్దరు నిందితులు జయచంద్రారెడ్డి, అతడి బావమరిది గిరిధర్‌రెడ్డిలు అరెస్టు కావాల్సి ఉంది.

జోగి సోదరుల కస్టడీకి పిటీషన్

ములకలచెరువు నకిలీ మద్యం కేసులో నిందితులైన మాజీ మంత్రి జోగి రమేశ్, జోగి రాములను కస్టడీకి కోరుతూ బుధవారం ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఇబ్రహీంపట్నం నకిలీ మద్యం కేసులో అరెస్టయి నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న జోగి సోదరులను ఈనెల 2వ తేదీ ములకలచెరువు కేసుకు సంబంధించి పీటీ వారెంట్‌పై తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరిచారు. ఈ క్రమంలో జోగి సోదరుల నుంచి నకిలీ మద్యం తయారీ వ్యవహారంపై కీలక విషయాలు రాబట్టాల్సి ఉందని, కస్టడీకి ఇవ్వాలని పిటీషన్ దాఖలు చేశారు.

మేయరుగా పాకా సురేశ్

- ఖరారు చేసిన వైసీపీ
- ఎంపీ అవినాశ్ ఇంట్లో కార్పొరేటర్ల సమావేశం
- పీఠం కోసం ముగ్గురు పోటీ
- పాకా వైపు మొగ్గు చూపిన మెజారిటీ కార్పొరేటర్లు
- నేడు కార్పొరేషన్ మేయరు ఎన్నిక
- ఏర్పాట్లు పూర్తి

(కడప-ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ మేయరు అభ్యర్థిగా 47వ డివిజన్ కార్పొరేటరు పాకా సురేశ్‌ను వైసీపీ ఖరారు చేసింది. మాజీ మేయరు సురేశ్‌బాబు నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయడంతో మున్సిపల్ శాఖ ఆయనను పదవి నుంచి తొలగించింది. దీంతో మేయరు ఎన్నిక అనివార్యమైంది. ఎన్నికలను అడ్డుకునేందుకు మాజీ మేయరు సురేశ్‌బాబు న్యాయస్థానాన్ని ఆశ్రయించినప్పటికీ ఎన్నికలకు కోర్టు లైన్ క్లియర్ చేసింది. గురువారం ఉదయం కార్పొరేషన్ సమావేశ మందిరంలో జేసీ అదితిసింగ్ అధ్యక్షతన మేయరు ఎన్నిక అధికారికంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలుకానుంది.



సమావేశ మందిరాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

మేయరు పదవి కోసం పోటీ

మేయరు పదవి కోసం వైసీపీ కార్పొరేటర్ల మధ్య పోటీ నెలకొంది. కడప వైసీపీలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ మేయరు సురేశ్‌బాబు వర్గాలుగా ఉన్నారు. కార్పొరేటర్లలో కూడా మూడు వర్గాలున్నాయి. మేయరు పదవి కోసం 47వ డివిజను కార్పొరేటరు పాకాసురేశ్, 10వ డివిజను కార్పొరేటరు మల్లికార్జున, 37వ డివిజను కార్పొరేటరు శ్రీవాణి పోటీపడ్డారు. ఇది వైసీపీలో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ విషయాన్ని జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, ఎంపీ అవినాశ్‌రెడ్డి మాజీ సీఎం జగన్ దృష్టికి తీసుకు వెళ్లారని అంటున్నారు. సమయం తక్కువ ఉండడంతో కార్పొరేటర్ల అభిప్రాయాలు తీసుకుని ఎంపిక చేయాల ని జగన్ చెప్పారని అంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం అలం ఖాన్‌పల్లె సమీపంలో ఉన్న ఎంపీ అవినాశ్‌రెడ్డి స్వగృహంలో ఎంపీతో పాటు రవీంద్రనాథరెడ్డి, అంజద్‌బాషా, సురేశ్‌బా బు, మాసీమ బాబు కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. మేయర్ స్థానం కోసం ముగ్గురు పోటీ పడుతుండడంతో కార్పొరేటర్లతో ఓటింగ్ నిర్వహించారు. మేయర్‌గా ఎవరు ఉండాలో చీటీలు రాయాలని సూచించారు. సమావేశానికి 39 మంది కార్పొరేటర్లు హాజరయ్యారు.



పాకా సురేశ్

ఓటింగ్‌లో పాకా సురేశ్ వైపు ఎక్కువ మంది మొగ్గుచూపడంతో ఆయన పేరును ఖరారు చేసినట్లు వెల్లడించారు.

అధికారికంగా మేయరు ఎన్నిక గురువారం జరగనుంది. అక్కడ మేయరు పదవి ఆశించే అభ్యర్థులు పోటీలో ఉన్నామని చెప్పి నామినేషన్ వేస్తే తరువాత కార్పొరేటర్లతో ఓటింగ్ నిర్వహిస్తారు. అయితే ముందుగానే కార్పొరేటర్లతో ఓటింగ్ నిర్వహించి అభ్యర్థిని వైసీపీని ఖరారు చేసింది. కాగా పాకా సురేశ్ వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డికి ముఖ్య అనుచరుడుగా పేరొందారు.

మెరుగైన సేవలు అందించడమే ఏపీజీబీ లక్ష్యం

- లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు

రాయచోటిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించడమే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ లక్ష్యమని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. బుధవారం రాయచోటి పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లో రాయచోటి నియోజకవర్గ పరిధిలోని 13 శాఖల బ్రాంచ్ మేనేజర్లకు, కస్టమర్లకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా 13 శాఖల పరిధిలోని రుణదాతలకు స్కానర్ మంజూరు చేయడమే కాకుండా 70 శాతం పీఎం సొల్యూషన్ రుణగ్రహీతలకు క్యూఆర్ కోడ్‌ను ఎల్డీయం ఆంజనేయులు, సీసీయం మెప్మా అల్లాబకష్, అలీఖాన్ చేతుల మీదుగా అందజేశారు. అలాగే 10 సంవత్సరాలు పైబడి ఇన్ ఆపరేటర్స్ అకౌంట్స్ డెఫ్ట్ అకౌంట్స్ మీద ఆర్బీఐ చేపట్టిన మీ డబ్బు మీ హక్కు పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం బ్యాంకు సిబ్బంది బ్యాంకు అందిస్తున్న సేవలపై రాయచోటిలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాజంపేట రీజనల్ హెడ్ సుశాంత్‌కుమార్, రాయచోటి బ్రాంచ్ మేనేజర్ వినోద్‌కుమార్‌రాజు, రీజనల్ ఆఫీస్ సిబ్బంది నవీన్, శ్రీకాంత్‌రెడ్డి, ఇతర బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.



బ్యాంక్ సేవలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సిబ్బంది

శేషాచలంలో గజ..గజ

- 34 ఏనుగులు, 10 చిరుత పులుల సంచారం
- ఎవరినీ అనుమతించని అధికారులు




శేషాచలం అడవిలో తిరుగుతున్న ఏనుగు

రైల్వేకోడూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల్లో ఏనుగుల మంద సంచరిస్తోందని, 10చిరుత పులులు ఉన్నాయని, అడవిలోకి వెళ్లేందుకు ఎవరికీ అనుమతి లేదని అటవీ శాఖాధికారులు చెబుతున్నారు. ఇటీవల చిత్తూరు అడవుల నుంచి 34 ఏనుగులు (రెండు మందలు) వచ్చాయని, వీటిలో 8 గున్న ఏనుగులు ఉన్నాయని అటవీ అధికారులు తెలిపారు. మండలంలోని కుక్కలదొడ్డి అన్నమయ్య కాలిబాట నుంచి అడవి మార్గంలో తిరుమల, తుంబురతీర్థం వంటి ప్రాంతాలకు భక్తులు వెళుతుంటారు. అయితే ఏనుగుల మంద ఉండటం వల్ల అడవిలోకి వెళ్లేందుకు అటవీశాఖాధికారులు ఎవరికీ అనుమతి ఇవ్వడం లేదు. గున్న ఏనుగులు ఉన్నాయి కాబట్టి వాటిని కాపాడుకునేందుకు మనుషులు కనిపిస్తే పెద్ద ఏనుగులు దాడి చేసే ప్రమాదం ఉందని అటవీ శాధికారులు అంటున్నారు. చిత్తూరు, పలమనేరు, కుప్పం, తిరుపతి అడవుల నుంచి అన్నమయ్య అడవుల్లోకి తరచూ ఏనుగులు వస్తుంటాయని అటవీ శాఖ సిబ్బంది పేర్కొంటున్నారు. అటవీ శాఖాధికారులు, సిబ్బంది వాటి కంట పడకుండా అడవుల్లో ఎర్రచందనం స్మగ్లర్ల కోసం కూంబింగ్ చేస్తుంటారని అధికారులు చెబుతున్నారు.



ఏనుగుల లద్దె

అడవిలోకి అనుమతి లేదు..



అడవిలోకి అటవీ అధికారుల అనుమతి లేకుండా వెళితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ శాఖాధికారి జగన్నాథ్‌సింగ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవిలో ఎక్కడ ఎక్కువ ఆహారం ఉంటుందో అక్కడికి ఏనుగులు రావడం సహజంగా ఉంటుందన్నారు. అన్నమయ్య జిల్లా అటవీ పరిధి ఎక్కువ గా ఉండడంతో అడవిలోకి అనుమతి లేదన్నారు. అనుమతి లేకుండా వెళితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- జగన్నాథ్‌సింగ్, జిల్లా అటవీ శాఖాధికారి, రాజంపేట

లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలి

- జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రాధిక

రాయచోటి (నేతాజీ సర్కిల్), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బందికి నిర్దేశించిన లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాధిక తెలిపారు. బుధవారం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో ఐసీటీసీ కేంద్రంలో జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ఏఆర్‌టీ, ఐసీటీసీ, ఎస్‌టీఐ, క్షయవ్యాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధితులను గుర్తించి వారిని ఏఆర్‌టీ కేంద్రాల్లో నమోదు చేయాలన్నారు. పాజిటివ్ వచ్చిన వాళ్ల క్రమం తప్పకుండా మందులు వినియోగించేలా సిబ్బంది చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాల ఎయిడ్స్ నియంత్రణ అధికారి వేంపల్లి భాస్కర్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల సభ్యులతో కలిసి హెచ్‌ఐవీ పాజిటివ్ వచ్చిన వారికి క్షయ నిర్ధారణ పరీక్షలు తప్పకుండా చేయాలని సూచించారు. హెచ్‌ఐవీపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డబ్ల్యుహెచ్‌వోటీబీ కన్సల్టెంట్ డాక్టర్ టీఎన్ నితీశ్‌రామ్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య, పీపీఎం ఆరోగ్య ప్రణీత్, క్లస్టర్ సూపర్‌వైజర్ పీపీ ప్రసాద్, డీఎండీవో సిలార్‌సాబ్, క్లస్టర్ ప్రివెన్షన్ ఆఫీసర్ ఆనంద్‌కుమార్, టీబీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

31లోగా దరఖాస్తులు సమర్పించాలి

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (నేతాజీ సర్కిల్), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సొంత భూమి కలిగిన భూయజమానులందరూ జాయింట్ ఎల్‌పీఎం విభజనకు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తులను సంబంధిత సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో అందచేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక అవకాశం వల్ల ఈనెల 31 వరకు దరఖాస్తు రుసుం కేవలం రూ.50 మాత్రమే ఉంటుందని, ఈనెల 31 తర్వాత ఈ రుసుం రూ.550కి పెరుగుతుందన్నారు. అందువల్ల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గౌరవ వేతనానికి దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాస్టర్లు గౌరవ వేతనం కోసం దరఖాస్తు చేసుకోవాలని కడప, అన్నమయ్య జిల్లాల మైనార్టీ సంక్షేమశాఖాధికారి హిదయతుల్లా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ జిల్లాలోని పాస్టర్లకు రూ.5 వేలు గౌరవ వేతనం ఇచ్చేందుకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపిందన్నారు. ఈ గౌరవ వేతనం కొరకు సంబంధిత లబ్ధిదారులు వారి ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్, ఇతర పత్రాలను ఈనెల 15వ తేదీలోపు అప్‌లోడ్ చేసి కడప మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందచేయాలని తెలిపారు.

జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఈ-చలానాలను చెల్లించడం కోసం ప్రభుత్వం వాహనదారుల సౌకర్యం చేపట్టిన జాతీయ మెగా లోక్ అదాలత్‌ను జిల్లాలోని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఈనెల 13వ తేదీ శనివారం జరగబోయే జాతీయ మెగా లోక్‌అదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న ఈ-చలానాలను చెల్లించడానికి ప్రభుత్వం ఒక సువర్ణావకాశాన్ని కల్పించిందన్నారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా వాహనదారులు తమ వాహనాలపై ఉన్న పెండింగ్ ఈ-చలానాల విషయంలో ఎటువంటి అదనపు భారం లేకుండా కేవలం అసలు మొత్తాన్ని మాత్రమే చెల్లించి పెండింగ్ చలానాలను క్లియర్ చేసుకోవాలన్నారు.

సురేశ్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురు

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కడప మాజీ మేయరు సురేశ్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురైంది. కడప మేయరు ఎన్నిక నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. మేయర్ ఎన్నికను నిలుపుదల చేసేందుకు నిరాకరించింది. సభ్యుల పదవీ కాలం ముగియడానికి ఆరునెలల ముందు ఎన్నికలు నిర్వహించడానికి వీల్లేదన్న సురేశ్‌బాబు వాదనను తోసిపుచ్చింది. మేయర్, డిప్యూటీ మేయర్ పోస్టుల ఎన్నికకు ఈ నిబంధన వర్తించదని తేల్చిచెప్పింది. మేయర్ ఎన్నిక నిర్వహణకు ఎన్నికల కమిషన్ ఇచ్చిన నోటిఫికేషన్ చట్టబద్ధమైనదేనని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ బుధవారం తీర్పు ఇచ్చారు.



ఇత్తడితో తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్

ఇత్తడి వస్తువులకు వనిపెంట ప్రసిద్ధి

మైదుకూరు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వనిపెంట అంటేనే ఇత్తడి వస్తువులకు ప్రసిద్ధి అని, ఇక్కడ చేసిన ఇత్తడి వస్తువులకు దేశవ్యాప్తంగా మంచి పేరుందని ఏపీ హ్యాండ్ క్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని వనిపెంట ఇత్తడి పరిశ్రమ వద్దకు బుధవారం ఆయన విచ్చేసి 'గురు శిష్య హస్తకళా శిక్షణ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. లోహం కరిగించుట, అచ్చు తయారీ, కాస్టింగ్, మోతకట్టు చెక్కడం తదితర విషయాలను నేర్పించడంలో శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ శిక్షణ నిమిత్తం 30 మంది కళాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇక్కడ తయారైన వస్తువులకు ఏపీ హ్యాండ్ క్రాఫ్ట్స్ కార్పొరేషన్, లేపాక్షి ఎంపోరియం మార్కెటింగ్‌లో మద్దతుగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, ఖాజీపేట సిండికేట్ బ్యాంకు చైర్మన్ హరినాథరెడ్డి, లేపాక్షి సంస్థ ప్రతినిధులు లక్ష్మీనాథ్, శ్రీకాంత్, ఢిల్లీరావు, వనిపెంట ఇత్తడి పరిశ్రమ కార్మికుల సంఘం అధ్యక్షుడు ఇస్మాయిల్, ధనపాల రవి తదితరులు పాల్గొన్నారు.

భవనాల గుర్తింపులో అధికారులు బిజీబిజీ

- కలెక్టరేట్‌గా సబ్ కలెక్టర్ కార్యాలయం!
- జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఎస్పీ కార్యాలయం...!




సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న అటవీ శాఖ కార్యాలయం - సాంఘిక సంక్షేమ హాస్టల్

మదనపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ప్రకటన నేపథ్యంలో అధికార యంత్రాంగం అందుకు తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ఆధ్వర్యంలో మూడు రోజులుగా పట్టణంలోని ప్రధాన ప్రాంతాలు, భవనాలను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ నిశాంత్‌కుమార్ బీటీ కళాశాల, పక్కనే ఉన్న జీఆర్‌టీ స్కూల్‌తోపాటు వాటి మైదానాలను చూశారు. అలాగే ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మంగళవారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రధాన భవనాలను పరిశీలించారు. ముఖ్యంగా బీటీ కళాశాలతో పాటు జీఆర్‌టీ స్కూల్, నిమ్మనపల్లె రోడ్డులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల, సీఎస్‌ఐ స్కూల్ కాంపౌండ్, రేస్ కళాశాల, హంద్రీ-నీవా కార్యాలయం కాంపౌండ్‌లను విడతల వారీగా చూశారు.

ఇదిలా ఉండగా అధికారులు మరో ప్రాతిపాదనను తెరపైకి తెచ్చారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం మధ్య భాగంగా తీసుకుంటే.. నాలుగు వైపులా నాలుగు రోడ్లు ఉన్నాయి. ఇందులో లోపలి భాగాన వివిధ శాఖలకు చెందిన కార్యాలయాలు, హాస్టళ్లు ఉన్నాయి. వీటిన్నింటినీ ఖాళీ చేయించాలని నిర్ణయించారు. సబ్ కలెక్టర్ కార్యాలయాన్నే కలెక్టర్ కార్యాలయంగా పెట్టేస్తే అందులోని 23 విభాగాలకు కూడా ఇక్కడే భవనాలు, హాల్స్ కేటాయించవచ్చని చెబుతున్నారు. ఇందులో భాగంగా నాలుగు రోడ్ల లోపల ఉన్న అటవీ శాఖ కార్యాలయం, మున్సిపల్ టౌన్ హాలు, బేబీ వెల్‌కమ్ హోం, రెండు సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, వ్యవసాయ శాఖ కార్యాలయం ఉన్నాయి. విద్యుత్ సబ్‌స్టేషన్ మినహా అన్నింటినీ ఇతర ప్రాంతాలకు తరలిస్తే 15 ఎకరాల విస్తీర్ణంలో సువిశాలమైన ప్రాంతం, అందులో పచ్చని చెట్లతో చల్లటి వాతావరణంలో కలెక్టరేట్ ఉంటుందని చెబుతున్నారు. ఎక్కువ భాగంలో ఉన్న అటవీ శాఖ కార్యాలయాన్ని బసినికొండ-పుంగనూరు రోడ్డులోని నగరవనానికి తరలించాలనే ప్రాతిపాదన వచ్చింది. ప్రభుత్వం కేటాయించే నిధులతో అక్కడే కార్యాలయాన్ని నిర్మించుకోవచ్చని సూచిస్తున్నారు. అక్కడ ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్, బాలసదన్‌లను కూడా మరో హాస్టల్‌లో విలీనం చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఈ మేరకు రెవెన్యూ, సర్వే శాఖాధికారులు సంయుక్తంగా శాఖల వారీగా ఉన్న భవనాలు, హాల్స్, ఖాళీ ప్రదేశం, విస్తీర్ణాలను లెక్కించారు. ఈ మేరకు మ్యాపులు సిద్ధం చేస్తున్నారు. అలాగే క్రిష్టియన్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సీఎస్‌ఐ కాంపౌండ్‌ను కూడా పరిశీలించారు. ఇందులో ఎంఎల్‌ఎల్ హాస్పటల్ 11 ఎకరాలు, సీఎస్‌ఐ స్కూల్, నర్సింగ్ కాలేజీ, హాస్టల్స్ కలిపి 9.40 ఎకరాలు ఉన్నట్లు గుర్తించారు. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని కలెక్టర్ కార్యాలయంగా, బీటీ కళాశాలలో కొంత భాగాన్ని రెవెన్యూ విభాగానికి, నిమ్మనపల్లె రోడ్డులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఎస్పీ కార్యాలయం, దాని అనుబంధ వింగ్‌లకు కేటాయించాలని దాదాపు ఓ నిర్ణయానికి వచ్చారు. సుమారు 35 ఎకరాల విస్తీర్ణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఒక వైపున తీసుకోవాలని పోలీసు శాఖ నిర్ణయించినట్లు తెలిసింది.

అనువుగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలను పరిశీలించిన జిల్లాస్థాయి అధికారులు వాటి విస్తీర్ణం, మ్యాపులు రూపొందిస్తున్నారు. నాలుగైదు రోజుల్లో పూర్తి స్థాయిలో శాఖల వారీగా కేటాయింపులు పూర్తి చేయనున్నారు. ఇలా జిల్లాస్థాయిలో ఉండాల్సిన మొత్తం 63 విభాగాల కార్యాలయాలను ఈనెలాఖరులోగా గుర్తించే దిశగా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. మరోవైపు జనవరి మొదటికి జిల్లా అధికారికంగా ప్రకటించడం, వెంటనే కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం జనవరి 26వ తేదీ బెంగళూరు రోడ్డులోని బీటీ కళాశాల మైదానంలో గణతంత్ర వేడుకలు నిర్వహించేలా అధికారులు ముందుకెళ్తున్నారు.

సిరికల్చర్ భవనాల పరిశీలన...



అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి

మదనపల్లె టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ఏర్పాటులో భాగంగా మదనపల్లె పట్టణంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన హెచ్‌వోడీ కార్యాలయాలు, మదనపల్లె ఆర్డీవో కార్యాలయం నిర్వహణ కోసం భవనాల ఎంపికకు సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి పలుచోట్ల పరిశీలించారు. బుధవారం స్థానిక బెంగళూరు రోడ్డులోని సిరికల్చర్ (పట్టుగూళ్ల ఉత్పత్తి కేంద్రం) భవనాల్లో ఉన్న 19 గదులను సబ్‌కలెక్టర్ పరిశీలించారు.

ఈ గదులు పొడవు, వెడల్పు, భవనం పైభాగాన మోల్డింగ్ స్థితిని సబ్ కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. వీటితో పాటు మడికయ్యల శివాలయం వీధిలో ఉన్న బీటీ కళాశాల బాయ్స్ పీజీ హాస్టల్ భవనాలను పరిశీలించారు. అక్కడ ఆవరణలో ఉన్న కంపచెట్లను ఎక్స్‌కవేటర్‌తో క్లీన్ చేయించారు. అనంతరం ఆయా భవనాల స్కెచ్‌లను తయారు చేయాలని సచివాలయ సర్వేయర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ బాలసుబ్రమణ్యం, సర్వేయర్ సుబ్రమణ్యం, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

క్రికెట్ జిల్లా జట్టుకు మదనపల్లె విద్యార్థి



మదనపల్లె టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు చిత్తూరు జిల్లా జట్టుకు మదనపల్లె విద్యార్థి ఎంపికయ్యాడు. బుధవారం పీలేరులో నిర్వహించిన అండర్-17 విభాగం డివిజన్ స్థాయి క్రికెట్ పోటీల్లో మదనపల్లెలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి తారీష్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపరిచాడు. సెలెక్టర్లు అతడిని చిత్తూరు జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరెస్పాండెంట్లు అమృత, శ్రీదేవి మాట్లాడుతూ గురువారం చిత్తూరులో నిర్వహించే జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో తారీష్ పాల్గొంటాడని, అక్కడ ప్రతిభ చూపితే రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యే అవకాశం ఉందన్నారు.


ప్రకృతి వ్యవసాయ సూత్రాలు అమలు చేయాలి



మాధవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న డీపీఎం

రాయచోటిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేస్తున్న పంటల విధానంలో గ్రామ స్థాయి నుంచి ప్రకృతి వ్యవసాయ సూత్రాలను అమలు చేయాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ తెలిపారు. రాయచోటి పట్టణంలోని ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ న్యాచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) ఆధ్వర్యంలో ప్రారంభమైన ఐదు రోజుల శిక్షణలో భాగంగా బుధవారం రెండోరోజు డీపీఎం మాట్లాడుతూ ఐసీఆర్‌పీలు నిర్వహించాల్సిన విధులు, బాధ్యతల గురించి సమగ్రంగా వివరించారు. గ్రామ స్థాయిలో ప్రకృతి వ్యవసాయ సూత్రాలను రైతుల వద్దకు చేర్చడంలో ఐసీఆర్‌పీలు కీలకపాత్ర పోషించాలన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ప్రయోజనాలు రసాయన రహిత పంటల ద్వారా భూమి సారాన్ని కాపాడడం, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం వంటి అంశాలను వివరించారు. శిక్షణలో భాగంగా రాయచోటి మండల పరిధిలోని మాధవరం గ్రామం బలిజపల్లెలో ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి అనే రైతు పొలంలో ఏటీయం మోడల్, ఏ గ్రేడ్ మోడల్ వేరుశనగ పంటలను పరిశీలించారు. అనంతరం ఇన్‌పుట్ ప్రిపరేషన్‌పై ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, సీడ్ ఫెర్టిలైజేషన్ తయారీ విధానం, వాటి ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎన్ఎఫ్ఏ చిరంజీవి, ఎఫ్ఎంటీలు, ఐసీఆర్‌పీలు మండల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్జీవో అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక



ఎన్జీవో అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ సభ్యులు

రాయచోటిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక బుధవారం జరిగింది. ఈ సందర్భంగా రాయచోటి పట్టణంలోని ఎన్జీవో హోంలో చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవులు, రమేశ్, వై.ప్రసాద్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. నామినేషన్ల ప్రక్రియ అనంతరం ఒక్కొక్క పోస్టుకు ఒక్కో అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయగా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి రాఘవులు ప్రకటించారు. ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు ఎన్నికలను పర్యవేక్షించారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సహాధ్యక్షుడిగా డీవీ శివారెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.మహదేవ, ఈ.నరసింహ, సిద్ధయ్య, గణేశ్, ధీరజ్, స్వర్ణలత, కార్యదర్శిగా జె.శ్రీనివాసన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.హరిప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా రాజశేఖర్‌రెడ్డి, వంశీప్రసాద్, సందీప్‌కుమార్‌రెడ్డి, విజయలక్ష్మి, జ్యోతి, సంయుక్త, కార్యదర్శిగా అంజనమ్మ, కోశాధికారిగా నాగేశ్వర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రైల్వేకోడూరు, రాజంపేట, పీలేరు, మదనపల్లె, వాల్మీకిపురం తాలూకాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి ఉంటే పార్టీకి రాజీనామా చేయాలి

రాజంపేట జిల్లా సాధన జేఏసీ సమావేశంలో చమర్తి జగన్‌మోహన్‌రాజు



రిలే దీక్షలో సంఘీభావం తెలుపుతున్న జగన్‌మోహన్‌రాజు, అతికారి కృష్ణ తదితరులు

రాజంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా జిల్లాల విభజన చేసి రాజంపేటకు అన్యాయం జరిగినప్పుడు స్థానిక వైసీపీ నాయకులు ఏమాత్రం నోరుమెదపకుండా ఈ ప్రాంతానికి అన్యాయం చేశారని, వారికి చిత్తశుద్ధి ఉంటే వైసీపీకి రాజీనామా చేసి రాజంపేట ప్రజలకు క్షమాపణ చెప్పాలని రాజంపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. బుధవారం రాజంపేట పాతబస్టాండులో జిల్లా సాధన సమితి జేఏసీ ఏర్పాటు చేసిన రిలే దీక్షల శిబిరానికి హాజరై తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జిల్లా విషయంపై తప్పు చేశారని బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం మరోసారి వైసీపీ దీక్షల నాటకం ఆడుతూ మరోమారు రాజంపేటకు అన్యాయం చేయడానికి పూనుకున్నారని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ తప్పిదాలే రాజంపేటకు శాపంగా మారాయన్నారు. వైసీపీ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు భూకబ్జాలకు పాల్పడి కోట్లు సంపాదించి ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. రాజంపేట గొంతుకోసి తిరిగి కాపాడమని అరిస్తే ఎలా అని ప్రశ్నించారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి వైసీపీ హయాంలో కొత్త జిల్లాలు ఏర్పాటు చేసినప్పుడు జడ్పీ చైర్మన్‌గా ఉండి రాజంపేట జిల్లా కేంద్రం కావాలని ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. వైసీపీ నేతలు ఉమ్మడి కడప జిల్లాను విభజించినప్పుడే రాజంపేటను జిల్లా కేంద్రం చేసి ఉంటే ఇంత ఇబ్బంది ఉండేదా అన్నారు. రాజంపేట జిల్లా కోసం చిత్తశుద్ధితో చేసే పోరాటాలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. అందరూ కలిసి వస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ వద్దకు వెళ్లి తన జిల్లా వ్యవహారంపై అభ్యర్థిస్తామన్నారు. జనసేన పార్లమెంట్ నాయకుడు అతికారి కృష్ణ మాట్లాడుతూ రాజంపేట జిల్లా సాధనకు జనసేన పార్టీ అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. రాజీలేకుండా పోరాడుదామని పిలుపునిచ్చారు.

కూటమి నేతల ఆధ్వర్యంలో రిలే దీక్షలు ప్రారంభం

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ రాజంపేట పాతబస్టాండు ప్రాంతంలో కూటమి రిలే దీక్షలు ప్రారంభించారు. జేఏసీ నాయకులు, కూటమి నాయకులు ఈ రిలే దీక్షకు మద్దతు ప్రకటించారు. దీక్షా శిబిరంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూల విజయభాస్కర్, ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు అబ్బూరు ప్రభాకర్‌నాయుడు, సీపీఐ నాయకులు సికిందర్, సీపీఎం నాయకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని పోలీసుల సంక్షేమమే లక్ష్యం : ఎస్పీ



బ్యాంకు ప్రతినిధుల సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. బుధవారం ఎస్పీ పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రతినిధులతో జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది, అధికారులతో, హోంగార్డ్స్ 24 గంటలు విధి నిర్వహణలో నిమగ్నమై ఉంటారన్నారు. ఈ ఒత్తిడిలో కూడిన వాతావరణంలో సిబ్బందికి ఏవైనా అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వారికి మెరుగైన ఆరోగ్య భద్రత (హెల్త్ ఇన్సూరెన్స్) అందించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ నేపథ్యంలో ఆయా బ్యాంకులు తమ ఉద్యోగులకు అందిస్తున్న అత్యుత్తమ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీల వివరాలను త్వరితగతిన క్లైయిమ్ అయ్యే బీమా పథకాల గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. పోలీసు సంక్షేమం కోసం బ్యాంకులు అందించే అన్ని రకాల సేవలు, రాయితీలపై కూడా ఈ సందర్భంగా ఎస్పీ చర్చించారు. అలాగే త్వరలోనే పోలీసు సిబ్బంది కోసం ఒక అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తామని, ఆ సదస్సులో తమ ఆరోగ్య బీమా పథకాల పూర్తి వివరాలను, ప్రయోజనాలను సిబ్బందికి స్పష్టంగా తెలియజేయాలని బ్యాంక్ ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో ఎస్బీఐ, యాక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రతినిధులతో పాటు, ఏఎవో త్రినాధ సత్యం, ఆర్‌ఐ వెల్ఫేర్ ఎం.పెద్దయ్య, ఎస్పీ సీసీ ఉదయ్‌కుమార్, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

ఎప్పటికి పూర్తవుతుందో...?

- నత్తనడకన అన్న క్యాంటీన్ భవన నిర్మాణం
- నిర్మాణానికి రూ.61 లక్షలు మంజూరు
- జూలై నుంచి ముందుకు సాగని పనులు



నత్తనడకన సాగుతున్న అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులు

పీలేరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు రూ.5కే కడుపునిండా రుచికరమైన భోజనం పెట్టాలన్న ఉన్నతమైన ఆశయంతో అన్న క్యాంటీన్ పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా పలు నియోజకవర్గాలలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. హోటళ్లకు వెళ్లి వందలాది రూపాయలు వెచ్చించి ఆకలి తీర్చుకోలేని పేదల పాలిట అన్న క్యాంటీన్ ఓ వరంగా మారింది. నిత్యం వేలాదిమంది పేదలు అన్న క్యాంటీన్లలో అతి తక్కువ ధరకే రుచికరమైన ఆహారంతో తమ ఆకలి తీర్చుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో రెండో విడతలో భాగంగా పీలేరు నియోజకవర్గానికి అన్న క్యాంటీన్ మంజూరు చేయించారు. ఇందులో భాగంగా నియోజకవర్గ కేంద్రమైన పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో క్యాంటీన్ నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించారు. అనంతరం ప్రభుత్వం భవన నిర్మాణం కోసం రూ.61 లక్షలు నిధులు మంజూరు చేసింది. నిధులు మంజూరైనా భవన నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ ఏడాది జూలై 10వ తేదీ భవన నిర్మాణానికి పీలేరులో భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. దీంతో భవన నిర్మాణం మూడు నెలల్లో పూర్తి చేసి నవంబరు నుంచి అన్న క్యాంటీన్ పేదల ఆకలి తీర్చడం కోసం అందుబాటులోకి వస్తుందని అందరూ భావించారు. భవన నిర్మాణ ప్రారంభం నుంచి పనులు నత్తనడకన సాగుతుండడంతో ఎప్పటికి నిర్మాణం పూర్తి చేస్తారో అన్న అనుమానం స్థానిక టీడీపీ నేతల్లో నెలకొంది. ప్రారంభం నుంచి మూడు నెలల వ్యవధిలో అక్టోబరు 10 నాటికి క్యాంటీన్ నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు సగం పనులు కూడా పూర్తి కాకపోవడంతో సర్వత్రా నిరుత్సాహం నెలకొంది. ఐదు నెలలైనా సగం పనులు కాలేదు. నవంబరు నాటికీ అన్న క్యాంటీన్ అందుబాటులోకి వస్తుందని అందరూ భావించారు. అయితే ఆ దిశగా పనులు ముందుకు సాగకపోవడంతో అన్న క్యాంటీన్ ఎప్పటికో అన్న అనుమానం అందరూ వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్, నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక చొరవ చూపి పనులు వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మార్కెట్ కమిటీ షాపింగ్ కాంప్లెక్స్

అద్దె బకాయి రూ.10.8 లక్షలు

పీలేరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ షాపింగ్ కాంప్లెక్స్ అద్దె బకాయి రూ.10.8 లక్షలకు చేరుకుంది. మార్కెట్ కమిటీ అధికారుల ఉదాసీనత వల్లే నెలనెలా చెల్లించాల్సిన అద్దె చెల్లింపులో తీవ్ర జాప్యం నెలకొందని ఆరోపణలు ఉన్నాయి. పీలేరు మార్కెట్ కమిటీకి నెల నెలా షాపింగ్ కాంప్లెక్స్, గోడౌన్ల ద్వారా నెలకు సుమారు రూ.4,72,056 వస్తుంది. దీని ద్వారానే ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర ఖర్చులకు వాడుతున్నారు. అయితే కాంప్లెక్స్‌లో షాపుల యజమానుల నుంచి కొన్ని షాపులలో నెలల తరబడి అద్దె బకాయిలు ఉండడం గమనార్హం. షాపుల యజమానుల నుంచి అద్దె వసూలు చేయడంలో మార్కెట్ కమిటీ అధికారుల విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి.

ఉత్పత్తిదారులకు వరం ఎంఎస్ఎంఈ

ఇండస్ట్రియల్ జిల్లా జనరల్ మేనేజరు కృష్ణకిశోర్



సమావేశంలో పాల్గొన్న ఇండస్ట్రియల్ జీఎం కృష్ణకిషోర్

మదనపల్లె అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ పరిశ్రమల ఉత్పత్తిదారులకు గొప్పవరమని ఇండస్ట్రియల్ జిల్లా జనరల్ మేనేజరు కృష్ణకిషోర్ అన్నారు. గొల్లపల్లె బైపాస్ రోడ్డులోని శ్రీరస్తు కల్యాణమండపంలో బుధవారం యువతకు అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న చిన్న, మధ్య తరహా పరిశ్రమల తయారీ కేంద్రాలను పెడుతున్న వారికి ఆర్థికంగా చేయూతనిస్తున్న ఎంఎస్ఎంఈ సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తున్నామని, దీనివల్ల వారు ఏర్పాటు చేసుకున్న ప్రాజెక్టులను ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. ఏపీ ఎంఎస్ఎంఈ ద్వారా నిర్దేశించిన బ్యాంకుల ద్వారా రాయితీ రుణాలు మంజూరవుతాయని, కావున అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమం ద్వారా మదనపల్లెలో ఉచిత సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ సిబ్బంది, పరిశ్రమల లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు తంబళ్లపల్లె ఎంపీపీ ఉప ఎన్నిక

తంబళ్లపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ఎంపీపీ ఉప ఎన్నిక గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాపూజీ పట్నాయక్ తెలిపారు. తంబళ్లపల్లె ఎంపీపీ అనసూయమ్మ వ్యక్తిగత కారణాల వలన ఈ ఏడాది అక్టోబరు 13న తన ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. దీంతో మండలంలోని ఎంపీటీసీల ఆమోదంతో కోసువారిపల్లె ఎంపీటీసీ చిటికి శ్యామలమ్మను ఇన్‌చార్జ్ ఎంపీపీగా అక్టోబరు 27న ఎంపీడీవో ప్రమాణం చేయించారు. అవిశ్వాస తీర్మానం, రాజీనామా తదితర కారణాలతో రాష్ట్రంలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయడానికి ఈనెల 11వ తేదీ ఎంపీపీ ఉప ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 11 గంటలకు తంబళ్లపల్లె మండలంలో ఉన్న 11 మంది ఎంపీటీసీల కోరంతో నియోజకవర్గ ప్రత్యేకాధికారి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కాగా తంబళ్లపల్లె మండలంలో మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలు ఉండగా అన్ని స్థానాల్లో వైసీపీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

మదనపల్లెలో మిస్సింగ్..

శ్రీనివాసమంగాపురంలో హత్య

చంద్రగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మిస్సింగ్ అయిన వ్యక్తి.. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురంలో హత్యకు గురయ్యాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె రూరల్‌కు చెందిన ఆవుల నరసింహులు, నాగరాజు, కత్తి నరసింహులు, నారాయణస్వామి.. చంద్రగిరి మండలం నరసింగాపురానికి చెందిన మునిరాజ స్నేహితులు. వీళ్లు తాంత్రిక వైద్యం, గుప్త నిధుల తవ్వకాలు చేస్తుంటారు. అయితే ఆవుల నరసింహులు.. తన భార్యతో సన్నిహితంగా ఉండటంపై నాగరాజు ఆగ్రహించాడు. ముందస్తు పథకం ప్రకారం అక్టోబరు 27వ తేదీ చంద్రగిరిలో తాంత్రిక వైద్యం చేయాలని ఆవుల నరసింహులు, నారాయణస్వామి, కత్తి నరసింహులను మదనపల్లెలో బస్సు ఎక్కించి పంపించాడు. వాళ్లకు తెలియకుండా వెనక మరో బస్సు ఎక్కి శ్రీనివాసమంగాపురంలో నాగరాజు దిగాడు. నరసింగాపురంలోని మునిరాజుకు ఫోన్ చేసి ద్విచక్ర వాహనం తీసుకురమ్మని చెప్పాడు. అనంతరం ఆవుల నరసింహులు ఒక్కడినే శ్రీనివాసమంగాపురానికి పిలిపించారు. ద్విచక్ర వాహనంలో అతడిని ఎక్కించుకుని.. మామిడి తోపులోకి నాగరాజు, మునిరాజ తీసుకెళ్లారు. అక్కడ హత్య చేసి పూడ్చి వేశారు. ఆవుల నరసింహులు కనిపించడం లేదని మదనపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా స్నేహితులనూ విచారించగా.. నాగరాజ, మునిరాజు హత్య చేసినట్లు తెలిసింది. దీంతో మదనపల్లె పోలీసులు గురువారం నిందితులను తీసుకొచ్చి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఓబులవారిపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కొర్లకుంట రైల్వే వంతెన సమీపంలో నిలిచి ఉన్న లారీని ఢీకొని ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నఓరంపాడు పంచాయతీ అయ్యలరాజుపల్లెకు చెందిన సి.శ్రీనివాసులరెడ్డి అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో రైల్వేకోడూరు వైపు నుంచి గ్రామానికి వస్తుండగా నిలిపి ఉన్న లారీని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని కుటుంబ సభ్యులు రైల్వేకోడూరు ఆస్పత్రికి తరలించారు.

అరటి ధరలు.. ధమాల్

- ఆందోళనలో అన్నదాతలు
- సాగు పెట్టుబడి రాని వైనం
- ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూపులు


మిన్నయ్యగారిపల్లె వద్ద సాగు చేసిన అరటి

పెండ్లిమర్రి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన అరటి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు దిగాలు చెందుతున్నారు. ఏ పంట సాగు చేసినా పంట చేతికి వచ్చే సమయానికి ధరలు పతనం అవుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కనీసం సాగు కోసం పెట్టిన పెట్టుబడి కూడా అందక అన్నదాతలు.. ఇక మాకు ఆత్మహత్యలే శరణ్యమంటూ గగ్గోలు పెడుతున్నారు. వివరాల్లోకి వెళితే..

ఈ ఏడాది ఉల్లి, మిరప, టమోట, నిమ్మ ఇలా ఏ పంట సాగు చేసినా రైతులకు ఫలితం దక్కడం లేదు. ఇక అరటి ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. మూడు నెలల కిందట టన్ను రూ.20 వేలు పలికిన ధర నేడు టన్ను రూ.3 వేలకు పడిపోయింది. మన ప్రాంతంలో పండించే అరటికి ఇతర రాష్ట్రాలకు ఎక్స్‌పోర్టు లేకపోవడం, అక్కడ నుంచి అంతర్జాతీయ మార్కెట్‌లో విస్తారంగా అరటిపండ్లు లభిస్తుండటంతో మన పంటకు డిమాండ్ లేక పోవడం ప్రదాన కారణం.

మండలంలోని నాగాయపల్లె, చీమలపెంట, నందిమండలం, చెర్లోపల్లె తదితర గ్రామాల్లో ఎక్కువగా అరటి పంటను సాగు చేస్తారు. మొదటిసారి సాగు చేసిన పంట కోతకు వచ్చే సమయానికి 9 నెలల కాలం పడుతుంది. దుక్కిదున్నడంతో మొదలు ఎరువులు, పురుగుల మందులు, కలుపు, డ్రిప్ తదితర ఖర్చులతో ఎకరా అరటి సాగు చేసేందుకు లక్ష రూపాయలు ఖర్చు అవుతుంది. ఎకరాకు 1000 అరటి పిలకలు నాటాలి. మండలంలో భూసారాన్ని బట్టి ఒక్కో గెల 25 నుంచి 30 కేజీల వరకు ఉంటుంది. ఎకరాకు 30 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ధరలు బాగా ఉంటే ఖర్చులు పోను రైతులకు మంచి ఆదాయం వస్తుంది. అలా అదే భూమిలో తక్కువ సమయంలో రెండు మూడు కోలెలు సాగు చేసుకోవచ్చు. అయితే పండిన పంటను అడిగే దిక్కులేక ప్రభుత్వ సాయం కోసం రైతన్నలు ఎదురు చూపులు చూస్తున్నారు.



కోల్డ్‌స్టోరేజీలు ఏర్పాటు చేయాలి


ధరలు లేనప్పుడు పండించిన పంటను నిలువ ఉంచుకునేందుకు ప్రభుత్వం కోల్డ్‌స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలి. ఉద్యాన రైతులను దృష్టిలో పెట్టుకుని కోల్డ్‌స్టోరేజ్‌లు ఏర్పాటు చేస్తే ధరలు వచ్చినపుడు అమ్ముకునే వెసలు బాటు ఉంటుంది.

-జి.గోపాల్‌రెడ్డి, రైతు, మిన్నయ్యగారిపల్లె.

గిట్టుబాటు ధర కల్పించాలి

మా ప్రాంతంలో రైతులు ఎక్కువగా ఉద్యాన పంటలను సాగు చేస్తారు. పంట చేతికి అంది వచ్చే సమయానికి ధరలు లేక సాగు పెట్టుబడులు కూడా రావడం లేదు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించాలి.

-రమణారెడ్డి, రైతు, నాగాయపల్లె



పునుగు పిల్లి ప్రత్యక్షం...

- పట్టుకునేందుకు చేసిన ప్రయత్నం విఫలం


సెప్టిక్ ట్యాంకులో పడిన పునుగు పిల్లి

కడప ఎన్టీఆర్‌సర్కిల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరానికి సమీపంలో అరుదైన పునుగు పిల్లి ప్రత్యక్షమైంది. అటవీశాఖ అధికారులు దాన్ని పట్టుకునేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. వివరాల్లోకి వెళితే.. ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు కానీ బుధవారం కడప సెంట్రల్ జైలు సమీపంలో ఉన్న జగనన్న కాలనీలో గల డి-బ్లాక్‌లోని ఓ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సెప్టిక్‌ట్యాంకులో పునుగు పిల్లి పడింది. లోతు ఎక్కువగా ఉండడంతో బయటికి రాలేక అక్కడే ఉండిపోయింది. స్థానికుల సమాచారంతో అటవీశాఖ అటవీశాఖ బీట్ ఆఫీసర్ పార్వతి మరికొంత మంది సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పునుగు పిల్లిని రక్షించి అడవిలో వదిలేందుకు ప్రయత్నించారు. మొదట ఒక బకెట్ కట్ చేసి.. సంచి తగిలించి దాన్ని బయటికి తీయాలని ప్రయత్నించగా వీలు కాలేదు. అనంతరం నిచ్చెనను గుంతలోకి దింపారు. దాని ద్వారా బయటికి పునుగు పిల్లి వచ్చినా... ఎవరికీ చిక్కకుండా పారిపోయింది. దీంతో పునుగు పిల్లిని స్వాధీనం చేసుకునేందుకు అటవీశాఖ అధికారులు చేసిన ప్రయత్నం విఫలమైంది.

అసలైన నిందితులెవరో నిగ్గుతేల్చాలి

- వైసీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డి

కడప మారుతీనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తల్లిని, చెల్లినీ తిట్టిన అసలైన నిందితులెవరో నిగ్గుతేల్చాలని వైసీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డి ప్రభుత్వాన్ని, పోలీసులను కోరారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఆ ఇద్దరినీ తాను సోషల్‌మీడియాలో తిట్టానంటూ పోలీసులు అన్యాయంగా కేసులో ఇరికించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తాను పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో 2024 ఫిబ్రవరిలో ఫిర్యాదు చేశానన్నారు. అప్పట్లో ఎస్పీగా ఉన్న సిద్ధార్థ కౌశల్, పులివెందుల సీఐ శంకర్‌రెడ్డి కేసు నమోదు చేసి నిందితులను పట్టుకున్నారన్నారు. ఆ రోజు అరెస్టయిన నిందతులపై క్రైం నెంబర్ 45/2024గా కేసు నమోదు చేశారన్నారు. అయితే దానిపై పోలీసులు ఇప్పటికీ చార్జిషీట్ వేయలేదని, నిందితులు ఎవరనే సంగతిని బయటకు చెప్పడం లేదన్నారు. అదే విషయంగా తెలంగాణలో కూడా తనపై కంప్లయింట్ ఉందన్నారు. ఇప్పటికైనా పోలీసులు, ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపించి తనకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న మోటార్ సైకిల్


- ఇద్దరు యువకుల మృతి
- మహారాష్ట్రకు చెందిన వారిగా గుర్తింపు


సంఘటనా స్థలంలో యువకుల మృతదేహాలు, పరిశీలిస్తున్న పోలీసులు, స్థానికులు

ఎర్రగుంట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బతుకు దెరువు కోసం వచ్చిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. బుధవారం సాయంత్రం ఎర్రగుంట్ల పట్టణంలో ఆర్టీసీ బస్సును మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఈ సంఘటన జరిగింది. మృతులు మహరాష్ట్ర రాష్ట్రానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. వివరాల్లోకెళితే...

మహారాష్ట్ర రాష్ట్రం చంద్రాపుర్ జిల్లాకు చెందిన కరన్ విలాస్ తెలంగి(23), వినాయక్ శ్రవన్ చుదారి(34)లు పదిరోజుల క్రితం పనిచేసుకునేందుకు ఎర్రగుంట్లకు వచ్చారు. జువారీ కర్మాగారం లేబర్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. బుధవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఎర్రగుంట్ల-ముద్దనూరు రోడ్డులోని బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో మోటార్‌బైక్‌పై ఇద్దరు కలిసి వెళుతున్నారు. అదే సమయంలో సింహాద్రిపురం నుంచి ప్రొద్దుటూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సును ముందు భాగంలో ఢీకొన్నారు. దీంతో ఇద్దరు ఎగిరి రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయా లయ్యాయి. ఒకరు వెంటనే చనిపోయాడు. మరొకరు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా 108 సిబ్బంది వచ్చి పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ నాగమురళి సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. అప్పటికే ఏం జరిగిందో తెలియక జనం గుమికూడడం, పాఠశాలలు వదిలే సమయం కావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు క్లియర్ చేయించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్టీసీ డ్రైవర్ పరదేశిరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుల కుటుంబాలకు సమాచారం ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

రీసర్వేలో అవకతవకలపై విచారణ


రైతులతో మాట్లాడుతున్న జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ

కొండాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకయ్యకాలువ గ్రామంలోని భూముల రీసర్వేలో గతంలో జరిగిన అవకతవకలపై జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ బుధవారం విచారణ చేపట్టారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వెంకయ్యకాలువ గ్రామానికి చెందిన రైతులతో సమావేశమయ్యారు. కాగా, రీ సర్వే అవకతవకలపై రైతులు ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆమె సర్వే అధికారులతో కలిసి రైతులతో మాట్లాడారు. గతంలో భూముల రీసర్వే చేసినప్పుడు తప్పులు జరిగాయని, తమకు న్యాయం చేయాలని రైతులు ఆర్డీవోను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ గురప్ప, సర్వే అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ మార్కెటింగ్‌లో ఉచిత శిక్షణ

కడప కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప కలెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాలు (ఎస్సీ) నిరుద్యోగ యువతీ యువకులకు డిజిటల్ మార్కెటింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రాకేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఆపై చదివిన షెడ్యూల్ కులాలకు చెందిన 18-40 ఏళ్లలోపు యువతీ యువకులు శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణకు అవసరమైన సామగ్రి, శిక్షణ అనంతరం ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ఈనెల 13వ తేదీ లోపు మోడల్ కెరీర్ సెంటర్, ఎంప్లాయిమెంట్ ఆఫీసు, కడపలో గల న్యాక్ శిక్షణా కేంద్రాలలో సమగ్ర సమాచారం పొందవచ్చన్నారు. వివరాలకు 9985142155, 9618177697 నెంబర్లను సంప్రదించాలన్నారు.

బుడ్డశనగకు తడివేరు తెగుళ్లు


- రైతులను అప్రమత్తం చేసిన అధికారులు



రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి అన్నదాతలకు సూచనలు, జాగ్రత్తలను అందించారు. ప్రొద్దుటూరు మండల పరిధిలో బుడ్డశనగ పంట ఇప్పటికే ఆరు వేల ఎకరాలకు పైగా రైతులు సాగు చేస్తున్నారు. వీటి విస్తీర్ణం మరో రెండు వేల వరకు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారుల అంచనా. మండల పరిధిలోని చౌడూరు, పెద్దశెట్టిపల్లె, బొల్లవరం, దొరసానిపల్లె, తదితర పంచాయతీల్లో అధికంగా రైతన్నలు పంట సాగు చేశారు. ప్రస్తుతం పైరు శాకోపదశలో ఉంది. ఈ దశలో పంటకు వ్యాపిస్తున్న తడివేరు తెగులును మండల వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ సాంబవర హరికుమార్ గుర్తించారు. దీనిని నివారించేందుకు లీటరు నీటికి వంద గ్రాముల టెక్సాకొనజోల్, రెండు మిల్లీ లీటర్ల చొప్పున 19.19.19 ఎరువుతో కలిపి పిచికారి చేయాలన్నారు. ఇతర సందేహాలకు తమను సంప్రదించవచ్చన్నారు.

పుస్తక జ్ఞానంతో పాటు సామాజిక అవగాహన అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పుస్తక జ్ఞానంతో పాటు సామాజిక అవగాహన కూడా అవసరమని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో 75 సంవత్సరాలలో మానవ హక్కులు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో వీసీ మాట్లాడుతూ హక్కులు బాధ్యతలను సమానంగా స్వీకరించాలన్నారు. కీలక ఉపన్యాసకురాలైన డాక్టర్ ఎ. సునీత మానవ హక్కుల ప్రకటన చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. దేశంలో పెరుగుతున్న జాతీయ వాదం, పౌరుల విభజన వంటి ధోరణులు ప్రమాదకరమని, అవి జాతి హననానికి దారితీసే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్, కాశ్మీర్ పరిణామాలను ఉదాహరణగా పేర్కొన్నారు. సర్ పేరుతో ఓటర్ నమోదు ప్రక్రియలో దళిత-ఆదివాసి వర్గాలకు అన్యాయం జరుగుతోందని చెప్పారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ హక్కుల అమలుకు ప్రజల్లో అవగాహన ముఖ్యమని చెప్పారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్, కన్వీనర్ డాక్టర్ బీఆర్ సతీష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ తెలిపారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో డిజిటల్ హింస నిర్మూలనకు ఐక్యమవుదాం అనే అంశంపై 16 రోజుల క్రియాశీలతలో భాగంగా వెబినార్ నిర్వహించారు. లైంగిక వేధింపుల నిరోధక అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ మహిళా భద్రతా సెల్ సూపరింటెండెంట్ (సీఐడీ) ఐపీఎస్ రత్న వెలిసెల డిజిటల్ హింస, ఆన్‌లైన్ వేధింపుల రకాలు, ఐటియాక్ట్‌లోని శిక్షా నిబంధనలపై అవగాహన కల్పించారు. నేర తీవ్రతను బట్టి ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రెండు లక్షల రూపాయల వరకు జరిమానా పడే అవకాశం ఉందన్నారు. సైబర్ క్రైమ్ పోర్టల్, శక్తివారియర్, ఈగిల్ వంటి వేదికలను బాధితులు ఉపయోగించుకోవాలన్నారు.

కలివికోడి పరిహారం పెండింగ్ భూముల పరిశీలన


భూములను పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

అట్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంబళ్లగొంది లో కలివికోడి పరిహారం అందని రైతుల భూములను బుధవారం అన్నమయ్య జిల్లా జేసీ, జీఎన్ఎస్ఎస్ స్పెషల్ కలెక్టరు ఆదర్శ రాజేంద్రన్ పరిశీలించారు. 2008లో కలివికోడి పరిహారం అందని కొంత మంది రైతులు కోర్టును ఆశ్రయించడంతో వారి భూములను పరిశీలించారు. కార్యక్రమంలో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, ఎస్‌డీసీ యూనిట్-2 నీలరా మయ్య, అట్లూరు డిప్యూటీ తహసీల్దారు శిరీషా, వీఆర్వో వెంకటసు బ్బమ్మ, వీఆర్ఏ రాము పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



ఖాజీపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని చెర్లోపల్లె రోడ్డు సమీపంలో ఆర్టీసీబస్సు ఢీకొన్న సంఘటనలో బింగిమల్ల శివ కుమార్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఖాజీపేటకు చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు శివకుమార్ పని నిమిత్తం చెర్లోపల్లెకు వెళ్లి తిరిగి వస్తుండగా మైదుకూరు నుంచి కడపకు వెళుతున్న ఆర్టీసీ అద్దె బస్సు స్కూటర్‌ను ఢీకొంది. దీంతో శివకుమార్ వెనుకటైరు కింద కాలు పడడంతో నుజ్జు నుజ్జు అయింది. చికిత్స నిమిత్తం 108 ద్వారా కడప రిమ్స్‌కు తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు వారి బంధువులు తెలిపారు.

13న అంతర్ కళాశాలల పోటీలు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల స్త్రీ, పురుషుల క్రీడా పోటీలు డిసెంబరు 13వ తేదీ ఉదయం 9గంటలకు నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ క్రీడ బోర్డు కార్యదర్శి డాక్టర్ కొవ్వూరు రామసుబ్బారెడ్డి తెలిపారు. వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ క్రీడాంశాలు, పురుషులు బెస్ట్ ఫిజిక్ పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. వ్యాయామ విద్య క్రీడ శాస్త్రాల విభాగంలో నిర్వహించే ఈపోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలన్నారు.

మహిళా భద్రతపై అవగాహన

కడప క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళా భద్రతపై పాఠశాల, కళాశాలల్లో బుధవారం పోలీసు అధికారులు, సిబ్బంది విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సమాజంలో మహిళల భద్రత, పోక్సో ప్రాముఖ్యత గురించి వివరిస్తూ బాలికలు ఎదుర్కొనే మానసిక, శారీరక వేధింపుల పట్ల జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో వివరించారు. బాల్య వివాహాలు వల్ల కలిగే మానసిక, శారీరక, సామాజిక నష్టాలపై ఉదాహరణలతో వివరించారు.

జాతీయస్థాయి పోటీలకు కోడూరు విద్యార్థి


విద్యార్థి యతిన్‌చందన్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

రైల్వేకోడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మోదుకూరులో ఈనెల 6, 7, 8 తేదీల్లో నిర్వహించిన అండర్-19 రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో కోడూరుకు చెందిన ఎస్వీ జూనియర్ కళాశాల విద్యార్థి సి.యతిన్‌చందన్ ప్రతిభ ప్రదర్శించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జనవరి మూడో వారంలో మహారాష్ట్రలో నిర్వహించనున్న పోటీలో పాల్గొంటాడని బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎన్ శ్రీనివాసులు, డైరెక్టర్ వసుంధర తెలిపారు. అనంతరం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా హాకీ జట్టుకు ఎంపికైన జడ్పీ విద్యార్థినులు


ఎంపికైన షర్మిల, శృతిలతో ఎంఈఓ, హెచ్ఎం, పీడీలు

పులివెందుల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11, 12, 13 తేదీలలో అండర్-17 బాలికల హాకీ ఇంటర్ జిల్లాస్థాయి పోటీలలో కడప జిల్లా హాకీ జట్టుకు పులివెందుల జడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులు ఎంపికయ్యారు. హెచ్ఎం గంగిరెడ్డి, పీడీలు ఫ్రాన్సిస్ తెలియజేస్తూ తమ పాఠశాలకు చెందిన షేక్ షర్మిల, స్టాండ్‌బైగా కె.శృతిలు జిల్లా హాకీ జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 రామానాయుడు, హెచ్ఎం గంగిరెడ్డి, పీడీ రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. నెల్లూరులో జరిగే పోటీలలో ప్రతిభచూపి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి


ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న సీపీఐ, రైతు సంఘం నేతలు

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల పంటలు దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర కోరారు. రైతాంగ సమస్యలపై రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా బుధవారం కడప ఆర్డీఓ కార్యాలయం వద్ద సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. గాలి చంద్ర మాట్లాడుతూ తేమ శాతం, రంగు మారిందని కుంటి సాకులు చెబుతూ ధాన్యం కొనుగోలు చేయకుండా అనేక కొర్రీలు పెడుతున్నారన్నారు. కనీసం పంటను ఆరబెట్టుకోవడానికి, తడవకుండా కాపాడుకోవడానికి పట్టాలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రం, రైతు సేవ కేంద్రం, రవాణా ఇన్‌చార్జీలు, కస్టోడియన్ ఆఫీసర్లు రైస్ మిల్లర్లతో కుమ్మక్కై ధాన్యం దళారులకు అమ్ముకునే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీంతో 75కేజీల బస్తాను రూ.1200 అమ్ముకొని బస్తాకు రూ.400 నుంచి రూ.500 వరకు నష్టపోతున్నారన్నారు. ధాన్యంతో పాటు పత్తి కొనుగోలు విషయంలో పీఎం యాప్, సీఎం యాప్‌ల పేరుతో అనేక ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలరాజు, కౌలు రైతు సంఘం నాయకులు సుదర్శన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాళ్లు తప్ప ఏమీ లేని రాయచోటి

● అన్ని వనరులు ఉన్న రాజంపేట జిల్లా కేంద్రంగా తగదా?
● రైల్వే కోడూరులో జేఏసీ నేతల విమర్శ

రైల్వేకోడూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాళ్లు లేని రాయచోటిలో జిల్లా కేంద్రం ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి, అన్ని వనరులూ ఉన్న రాజంపేట కనిపించలేదా అని రైల్వేకోడూరు జడ్పీటీసీ సభ్యురాలు పాళెంకోట రత్నమ్మ, ఎంపీటీసీ సభ్యులు బండారు మల్లికార్జున, మహేశ్వర్‌రెడి తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు పాత బస్టాండు నుంచి భారీ ర్యాలీ నిర్వహించి తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వనరులూ ఉన్న రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలను కాదని, రాళ్లు తప్ప , తాగేందుకు నీరు కూడా లేని రాయచోటిని ఎలా జిల్లా కేంద్రం చేస్తారని ప్రశ్నించారు. అనంతరం రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేశారు. రాజంపేట వీలు కాకపోతే రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలో కలపాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో ఎంపీటీసీ సభ్యులు పి. రాజశేఖర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు వెంబడి రాధాకృష్ణ, నగిరిపాటి చెంగయ్య ఆధ్వర్యంలో రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని రైల్వేకోడూరు ప్రధానదారిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన విద్యార్థులు

పుల్లంపేట : మండలంలోని అన్ని విద్యా సంస్థల యాజమాన్యం విద్యార్థులు మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. నాలుగురోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. ప్రజలకు సౌకర్యవంతమైన ప్రాంతాన్ని జిల్లా చేయాలని రాయచోటి వద్ద రెండు నియోజకవర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం, నాయకులు ఈ విషయాన్ని గమనించి ఎన్నికల వాగ్దానంలో ఇచ్చిన విధంగా రాజంపేటను జిల్లా చేయాలని అలా కాకుండా రాయచోటి జిల్లా చేసి గతంలో వైసీపీ చేసిన పొరపాట్లను చేయకూడదంటూ బీజేపీ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలాన్ని కడప జిల్లాలోనే ఉంచాలంటూ బుధవారం స్థానిక కోదండ రామాలయం నుంచి స్థానిక తహసీల్దారు కార్యాలయం వరకు భారీ ర్యాలీ, వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ అనంతరం జేఏసీ ప్రతి నిధులు, తహసీల్దారు ఎంపీడీవోకు వినతిపత్రాలను అందజేశారు. జడ్పీటీసీ సభ్యుడు ముద్దు కృష్ణారెడ్డి, ఎస్వీ రమణ, గజ్జల నరసింహారెడ్డి, సాలాబాదు బుజ్జి, తదితరులు పాల్గొన్నారు. కాగా జేఏసీ నాయకుల రిలే నిరాహార దీక్షలు ఐదోరోజుకు చేరాయి. జనసేన నాయకులు అతికారి కృష్ణ, రామచంద్రయ్య, జేఏసీ నాయకులు, అడ్వకేట్ రామదాసు, పాటూరు గంగిరెడ్డి, రఘురామిరెడ్డి, కట్టా యానాదయ్య, పసుపులేటి వెంకటరమణ, అమానుల్లా, కత్తి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం తప్పిదం వల్లే..

సిద్దవటం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల అభిప్రాయం మేరకు గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలన్నారు. లేనిపక్షంలో ప్రజా ఆగ్రహం తప్పదన్నారు. జనసేనపార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది స్వార్థపరుల కోసం రాజంపేటకు అన్యాయం చేశారని అన్నమయ్య పుట్టిన గడ్డ రాజంపేట అని ఆయన పేరు పెట్టి.. రాయచోటిని జిల్లా కేంద్రం చేయగడం తగదన్నారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ మాట్లాడుతూ కడప జిల్లా అంతర్భాగమైన సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలను అన్నమయ్య జిల్లాలో విలీనం చేయడంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. పంచాయతిరాజ్ చాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరి కుప్పాల వెంకటసుబ్బయ్య, సర్పంచ్ బి.నాగరాణి, ఉప మండలాధ్యక్షులు నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు పలువురు దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.



పుల్లంపేటలో జిల్లా సాధన కోసం మానవహారం ఏర్పాటు చేసిన విద్యార్థులు



ఒంటిమిట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

మంత్రి మండిపల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చిన్నమండెం, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): జిల్లా కేంద్రంగా రాయచోటిని నిలుపుకునేందుకు కృషి చేసిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితోపాటు, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చిత్ర పటాలకు మండలంలోని చాకిబండలో బుధవారం మండల టీడీపీ నాయకులు అర్షద్, ఆనందరెడ్డిల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఅనునిత్యం ప్రజా సంక్షేమం కోసమే పాటుపడే నాయకుడు మంత్రి మండిపల్లిరాంప్రసాద్‌రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆనందరెడ్డి, కార్తీక్, రఘునాథరెడ్డి, గ్రామ ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, అక్రమ్, శివారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నాగరాజు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీవాసులకు దుప్పట్లు పంపిణీ

ఓబులవారిపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బొమ్మవరం గ్రామ పంచాయతీ పరిధిలోని కంసాలమ్మ ఎస్టీ కాలనీ గ్రామస్థులకు తెలుగుదేశంపార్టీ నాయకులు ఉమ్మలరాజు సుబ్బరాజు దుప్పట్లు పంపిణీ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు తీవ్ర చలివాతావరణం నెలకొనడంతో గుడిసెల్లో నివాసం ఉంటున్న గిరిజనుల ఆవేదనను గమనించి గ్రామంలో సుమారు 50 దుప్పట్లను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఫ్లాగ్‌డే కోసం విరాళాల సేకరణ

చిట్వేలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఫ్లాగ్ డే సందర్భంగా బుధవారం చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ ఆధ్వర్యంలో క్యాడెట్లు విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు బి.దుర్గరాజు, ఎన్‌సీసీ కేడెట్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణకు కవచంగా ఉన్న సైనికులకు విరివిగా విరాళాలు అందించాలని తెలియజేశారు. ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్ మాట్లాడుతూ దేశ రక్షణలో ప్రాణాలను పణంగా పెడుతున్న సైనికుల సంక్షేమం కోసం ఇస్తున్న ఈ విరాళం ఎంతో విలువైందని, తెలిపారు. ఈ కార్యక్రమం పాఠశాల నుంచి మొదలై కొత్తబస్టాండు, పాతబస్టాండు మీదుగా వైఎస్ఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, ప్రజలు, వివిధ కార్యాలయాల్లోని అధికారుల నుంచి వివరాలు సేకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు, మండల అభివృద్ధి అధికారి, మండల విద్యా శాఖాధికారులు, రెవెన్యూ, పోలీసు, వైద్యం, వెలుగు, సచివాలయ సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం

నందలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మానవహక్కుల దినం సందర్భంగా హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారంకడప, మండలంలోని నాగిరెడ్డిపల్లె డీఎంసీ రోడ్ ప్రాంతీయ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల చైర్మన్ డాక్టర్ వి.డేవిడ్, రాయలసీమ చైర్మన్ వీరబల్లె జయకుమార్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా విజిలెన్స్ చైర్మన్ గోపినేని ప్రసాద్, గుంతకల్ రైల్వే కన్సల్టెంట్ మెంబర్ రాచూరి మురళి, నాగరాజు, సాయి, వెంకటేశ్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట: ప్రపంచ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం దళవాయిపల్లె పాఠశాల విద్యార్థులు బుధవారం ప్లకార్డులు చేతపట్టి ప్రదర్శన చేశారు.

దివ్యాంగులను దైవ సమానులుగా భావించాలి

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను దైవ సమానులుగా భావించి చేరదీయాలని ఎంఈవోలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య సూచించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత (బాలుర) పాఠశాలలో రాయచోటి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల ఉన్నత భవిష్యత్తు కోసం ప్రత్యేక పాఠశాలలతోపాటు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్యామ్, ప్రధానోపాధ్యాయుడు పూజారి వెంకటేశ్వర్లు, జెడ్పీ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణమ్మ, సుబ్బారెడ్డి, దివ్యాంగులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కొండారెడ్డి

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు ఫోన్ చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ టీవీ కొండారెడ్డి సూచించారు. సైబర్ నేరాలపై సోమవారం ఈడిగపల్లెలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి ఓటీపీ వచ్చింది చెప్పండి అని అడిగితే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఆధార్ నెంబర్, బ్యాంకు నెంబర్ అడిగినా చెప్పొద్దని తెలియజేశారు. గ్రామంలో శాంతి భద్రతలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. కోడిపందాలు, జూదం ఆడిన వెంటనే పోలీసులకు తెలియజేశారు. బాల్యవివాహాలపై ఐసీడీఎస్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి వారికి న్యాయం చేయాలన్నారు. కొత్తవారు ఎవరైనా గ్రామాల్లో సంచరిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ, ఎస్ఐ రవీంద్రబాబు, న్యాయవాది తుమ్మల వంశీకృష్ణ, గ్రామ నాయకులు ఓబుల్‌రెడ్డి, నందిని, గ్రీన్ అంబాసిడర్లు, పాల్గొన్నారు.

రామాపురం : చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రామాపురం ఎస్ఐ శివకుమార్ అన్నారు. రామాపురం మండలం గంగనేరు రాచపల్లిలో బుధవారం లక్కిరెడ్డిపల్లె సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొండారెడ్డి, రామాపురం సబ్ ఇన్‌పెక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగిరెడ్డి, చాన్‌బాషా, మదన్‌మోహన్, రాంమోహన్, వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ విశ్వనాథ్, పోలీసు సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించండి

రాయచోటి నేతాజీ సర్కిల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):ప్రధాని నరేంద్రమోడీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిద్దామని జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి ఆనంద గజపతిరాజు పిలుపునిచ్చారు. బుధవారం సంబేపల్లె మండల కేంద్రంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రేవన శివప్రసాద్, మండల ఇన్‌చార్జి డాక్టర్ పాలగిరి శ్రీనివాస్‌రాజు కార్యకర్తలు వెంకటేశ్, ఇబ్రహీం, పర్వతరెడ్డి, సాయికుమార్‌రాజు, సలావుద్దీన్, అల్లాబకష్, రెడ్డెప్పనాయుడు, సురేంధర్‌రాజు, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీ నిర్మాణంలో జాప్యంతో ఇబ్బందులు

ఓబులవారిపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం రెండేళ్లుగా కొనసాగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేగేట్లు వేయడంతో సమయం వృధా అవుతుండడాన్ని గమనించిన కేంద్ర ప్రభుత్వం రైల్వేశాఖలు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది. అయితే పనులు నత్తనడక నడుస్తు న్నాయి. ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్‌కు రెండువైపులా గ్రామాలున్నాయి. వందలాది ఎకరాల పంట భూములు, వై.కోట, గాదెల, నూకనపల్లె వంటి గ్రామాలు ఒక వైపు ఉండగా, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ హైస్కూల్, పాలిటెక్నికల్ కళాశాలలు, మండల తపాల కేంద్రం, పోలీసుస్టేషన్ తదితర ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు ఒక వైపు ఉండడంతో, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు..

ప్రభుత్వ భూముల స్వాధీనం

గాలివీడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గరుగుపల్లి గ్రామంలో ఆక్రమణకు గురైన పిలుగుంట్రరాళ్ల గుట్టను రెవెన్యూ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ, పోలీసుశాఖలు ఆ స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ భాగ్యలత, ఎస్ఐ రామకృష్ణ గ్రామస్తులతో కలిసి సర్వే నెంబర్ 696లో 3.80 ఎకరాలు, 697లో 5.44 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు కేటాయించారు. అనంతరం అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల పరిధిలో ప్రభుత్వ స్థలాలను అక్రమంగా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక వీఆర్వో, సర్వేయర్లు పాల్గొన్నారు.

90 మంది విద్యార్థులకు దంత పరీక్షలు

సుండుపల్లె, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): 90 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించినట్లు మానవత జిల్లా ఆర్థిక ఆర్యదర్శి హరి కుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మానవతా సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దంతాలను రక్షించుకోవడం ఎలా అనే విషయాలను డాక్టర్ ఉదయ్‌కాంత్ వివరించారు. పేస్ట్, బ్రష్‌లు పంపిణీ చేశారు. స్కూల్ కరస్పాండెంట్ నాగేశ్వరరావు, మానవతా కన్వీనర్ కృష్ణంరాజు, లక్ష్మయ్యనాయుడు, రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటిన్‌ను పరిశీలించిన చమర్తి



అన్న క్యాంటిన్‌లో భోజనం చేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను బుధవారం టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు పరిశీలించారు. భోజన నాణ్యతను పరిశీలించారు. భోజన ఏర్పాట్లు, అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. రోజూ భోజనం చేస్తున్నారని ఆరా తీశారు. అందరితో కలిసి అన్న క్యాంటీన్‌లో భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ గన్నే సుబ్బనరసయ్యనాయడు, మాజీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మన్నూరు సింగిల్‌విండో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

మన్నూరు సింగిల్‌విండో నూతన కార్యవర్గం సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా సుబ్రమణ్యంనాయుడు, తదితర డైరెక్టర్లు ప్రమాణం చేశారు. టీడీపీ ఇన్‌ఛార్జి జగన్‌మోహన్‌రాజు సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వీరబల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల అధికారులు రైతులకు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం రైతు సమాఖ్య ఆధ్వర్యంలో వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, ఉపాధి, ప్రకృతి వ్యవసాయశాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో స్వాతి మాట్లాడుతూ ప్రభుత్వం వరి ధాన్యం క్వింటాలుకు రూ.2,360 మద్దతు ధర నిర్ణయించిందన్నారు. మొక్కజొన్న ఆయిల్‌పామ్ సాగుతో ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. ఉద్యానశాఖ అధికారి వనిత మాట్లాడుతూ మామిడి సంరక్షణకు అన్ని రైతు సేవా కేంద్రాల్లో కవర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పశువైద్యాధికారి గణేశ్ మాట్లాడుతూ 50 శాతం సబ్సిడీతో దాణా పంపిణీకి సిద్ధంగా ఉందన్నారు. గ్రామంలో నట్టల నివారణ టీకాలు వేస్తున్నామన్నారు. ఉపాధి అధికారి చంద్రకళ మాట్లాడుతూ ఉద్యాన పంటల సంరక్షణకు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు రాచన్న, కోశాదికారి రాంప్రసాద్, సీసీలు కృష్ణయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.

'పాడి పశువుల అభివృద్ధికి ప్రాధాన్యం'

రాజంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పాడి పశువుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాజంపేట మార్కెట్‌యార్డు చైర్మన్ గన్నే సుబ్బనరసయ్యనాయుడు తెలిపారు. బుధవారం రాజంపేట మండలం చుండువారిపల్లెలో సీనియర్ టీడీపీ నాయకులు, డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చుండు సుధీర్ సహకారంతో రాష్ట్రీయ గోకుల మిషన్ సౌజన్యంతో పశువుల ఉచిత చికిత్స శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చుండు సుధీర్, రాజంపేట ఉపసంచాలకులు డాక్టర్ విజయభాస్కర్, సహాయ సంచాలకులు ప్రతాప్, డాక్టర్లు వేదవతి, భాగ్యవతి తదితరుల పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు పండ్లు, మెడికల్ కిట్లు పంపిణీ

గాలివీడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల దీక్షలు ముగించుకుని శబరిమలైయాత్రకు బయలుదేరిన అయ్యప్ప భక్తులకు అమీన్ మెడికల్స్ ఆధ్వర్యంలో ముస్లింలు పండ్లు, మెడిక ల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషణ్ రెడ్డి, మైనార్టీ నాయకుడు ఎస్కే నిజాముద్దీన్ మాట్లా డుతూ ఇలాంటి సంప్రదాయాలు హిందూ, ముస్లింల మధ్య మత సామరస్యం పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, ముస్లింలు అమీన్, జైద్, లతీఫ్, సాజిద్, అజీస్, యూనిస్, జాకీర్, సమీవుల్లా, ఖయ్యాం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫర్నిచర్ అందజేత



సోలార్ గ్రీన్ కో అందజేసిన డెస్కులు

రామాపురం, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ సూరకవాండ్లపల్లె ప్రాథమిక పాఠశాలకు బుధవారం గ్రీన్ కో సోలార్ ఆధ్వర్యంలో 12 డెస్కులు, 3 టేబుళ్లు, 5 కుర్చీలు అందజేసినట్లు రామాపురం మండల టీడీపీ అధ్యక్షుడు గాలివీటి సురేంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో సుమారు 50 విద్యార్థులుండగా, ఒక ఉపాధ్యాయుడిని మాత్రమే నియమించడంతో విద్యార్థులు చదువులో వెనుకబడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ కో సోలార్ మేనేజర్ బాషా, , టీడీపీ నాయకులు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, , నందలూరు కోటిరెడ్డి, సహదేవరెడ్డి, దేవదర్శన్‌రెడ్డి, బండపల్లి బాస్కర్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ భవన భద్రతపై ఆర్ఎం పరిశీలన



ఎస్ఐతో మాట్లాడుతున్న ఏపీజీబీ ఆర్ఎం సుశాంత్‌కుమార్

రాయచోటి నేతాజీ సర్కిల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు భద్రత అంశాన్ని ఆశాఖ రీజినల్ మేనేజర్ సుశాంత్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఇటీవల బ్యాంకులో దుండగులు చోరీకి యత్నించిన సంఘటనపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. భవనాన్ని మార్చేందుకు స్థలాలను, భవనాలను పరిశీలించినట్లు తెలిపారు. బ్యాంకు భద్రతపై స్థానిక ఎస్ఐ రవికుమార్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వినోద్ కుమార్‌రాజు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో బీసీలకు ప్రత్యేక గుర్తింపు



సుబ్బరాజుయాదవ్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

రాయచోటి నేతాజీ సర్కిల్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం కష్టపడి పనిచేసిన బీసీ నాయకులకు ప్రత్యేక గుర్తింపు ఉన్నట్లు సంబేపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయం చైర్మన్‌గా బీసీ వర్గానికి చెందిన సుబ్బరాజు యాదవ్‌ను నియమించడంతో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల నాయకులకు పదవులు అందజేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీశాఖ మంత్రి లోకేశ్‌బాబు కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మడితాటి రవీంద్రారెడ్డి, యువగళం కోఆర్డినేటర్ మండిపల్లి సిద్దారెడ్డి, మాజీ సర్పంచులు కాటమ రాజు, వెంకటయ్య, వే ణుగోపాల్‌నాయుడు, మాధం బసిరెడ్డి, దేవపట్ల అమర్‌నాథరెడ్డి, శేషాద్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారి లేక ఇక్కట్లు

రామాపురం, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): పశు వైద్యాధికారి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని రాచపల్లికి చెందిన టీడీపీ నాయకులు శివారెడ్డి, రవీందర్‌రెడ్డి, మదన్‌మోహన్, రాంమోహన్ తెలిపారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ గ్రామంలో సుమారు 10 వేలకు పైనే బర్రెలు, మేకలు, గొర్రెలు ఉన్నాయని, వాటికి జబ్బులు వస్తే చూసే నాథుడు లేడన్నారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యాధికారి బదిలీ కావడంతో త స్థానంలో మరొకరిని నియమించలేదని తెలిపారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని రెగ్యులర్ పశువైద్యాధికారిని నియమించాలని కోరారు.

ఉద్యాన ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

రైల్వేకోడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మామిడి, అరటి, బొప్పాయి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు రామానాయుడు డిమాండ్ చేశారు. బుధవారం కోడూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో మామిడి, అరటి, బొప్పా యి రైతులు గిట్టుబాటు ధరలు లేక ప్రతి ఏటా నష్టపోతున్నారన్నారు. మామిడికి ధరలు లేని సమయంలో ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం ఆదుకోకపోతే రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక నల్లచట్టాలను వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు తుమ్మల రాధాకృష్ణయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పీ. మహేష్, సహాయ కార్యదర్శి తోపు కృష్ణప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబ, నియోజకవర్గ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, తుమ్మల చైతన్య, దార్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు దూరంగా ఉన్నప్పుడే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. బుధవారం ఏపీ మోడల్ స్కూల్‌లో క్రైమ్ టీం ఆధ్వర్యంలో విద్యా ర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ వరాల రమేశ్, వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అధ్యాపకులు రాజశేఖర్, శివశంకర్‌రెడ్డి, నాగయ్య, క్రైమ్ టీం పీరయ్య, గీత పాల్గొన్నారు.

భవనాల గుర్తింపులో అధికారులు బిజీబిజీ

- కలెక్టరేట్‌గా సబ్ కలెక్టర్ కార్యాలయం!
- జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఎస్పీ కార్యాలయం...!

మదనపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ప్రకటన నేపథ్యంలో అధికార యంత్రాంగం అందుకు తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ఆధ్వర్యంలో మూడు రోజులుగా పట్టణంలోని ప్రధాన ప్రాంతాలు, భవనాలను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ నిశాంత్‌కుమార్ బీటీ కళాశాల, పక్కనే ఉన్న జీఆర్‌టీ స్కూల్‌తోపాటు వాటి మైదానాలను చూశారు. అలాగే ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మంగళవారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రధాన భవనాలను పరిశీలించారు. ముఖ్యంగా బీటీ కళాశాలతో పాటు జీఆర్‌టీ స్కూల్, నిమ్మనపల్లె రోడ్డులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల, సీఎస్‌ఐ స్కూల్ కాంపౌండ్, రేస్ కళాశాల, హంద్రీ-నీవా కార్యాలయం కాంపౌండ్‌లను విడతల వారీగా చూశారు.

ఇదిలా ఉండగా అధికారులు మరో ప్రాతిపాదనను తెరపైకి తెచ్చారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం మధ్య భాగంగా తీసుకుంటే.. నాలుగు వైపులా నాలుగు రోడ్లు ఉన్నాయి. ఇందులో లోపలి భాగాన వివిధ శాఖలకు చెందిన కార్యాలయాలు, హాస్టళ్లు ఉన్నాయి. వీటిన్నింటినీ ఖాళీ చేయించాలని నిర్ణయించారు. సబ్ కలెక్టర్ కార్యాలయాన్నే కలెక్టర్ కార్యాలయంగా పెట్టేస్తే అందులోని 23 విభాగాలకు కూడా ఇక్కడే భవనాలు, హాల్స్ కేటాయించవచ్చని చెబుతున్నారు. ఇందులో భాగంగా నాలుగు రోడ్ల లోపల ఉన్న అటవీ శాఖ కార్యాలయం, మున్సిపల్ టౌన్ హాలు, బేబీ వెల్‌కమ్ హోం, రెండు సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, వ్యవసాయ శాఖ కార్యాలయం ఉన్నాయి. విద్యుత్ సబ్‌స్టేషన్ మినహా అన్నింటినీ ఇతర ప్రాంతాలకు తరలిస్తే 15 ఎకరాల విస్తీర్ణంలో సువిశాలమైన ప్రాంతం, అందులో పచ్చని చెట్లతో చల్లటి వాతావరణంలో కలెక్టరేట్ ఉంటుందని చెబుతున్నారు. ఎక్కువ భాగంలో ఉన్న అటవీ శాఖ కార్యాలయాన్ని బసినికొండ-పుంగనూరు రోడ్డులోని నగరవనానికి తరలించాలనే ప్రాతిపాదన వచ్చింది. ప్రభుత్వం కేటాయించే నిధులతో అక్కడే కార్యాలయాన్ని నిర్మించుకోవచ్చని సూచిస్తున్నారు. అక్కడ ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్, బాలసదన్‌లను కూడా మరో హాస్టల్‌లో విలీనం చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఈ మేరకు రెవెన్యూ, సర్వే శాఖాధికారులు సంయుక్తంగా శాఖల వారీగా ఉన్న భవనాలు, హాల్స్, ఖాళీ ప్రదేశం, విస్తీర్ణాలను లెక్కించారు. ఈ మేరకు మ్యాపులు సిద్ధం చేస్తున్నారు. అలాగే క్రిష్టియన్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సీఎస్‌ఐ కాంపౌండ్‌ను కూడా పరిశీలించారు. ఇందులో ఎంఎల్‌ఎల్ హాస్పటల్ 11 ఎకరాలు, సీఎస్‌ఐ స్కూల్, నర్సింగ్ కాలేజీ, హాస్టల్స్ కలిపి 9.40 ఎకరాలు ఉన్నట్లు గుర్తించారు. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని కలెక్టర్ కార్యాలయంగా, బీటీ కళాశాలలో కొంత భాగాన్ని రెవెన్యూ విభాగానికి, నిమ్మనపల్లె రోడ్డులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఎస్పీ కార్యాలయం, దాని అనుబంధ వింగ్‌లకు కేటాయించాలని దాదాపు ఓ నిర్ణయానికి వచ్చారు. సుమారు 35 ఎకరాల విస్తీర్ణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఒక వైపున తీసుకోవాలని పోలీసు శాఖ నిర్ణయించినట్లు తెలిసింది.

అనువుగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలను పరిశీలించిన జిల్లాస్థాయి అధికారులు వాటి విస్తీర్ణం, మ్యాపులు రూపొందిస్తున్నారు. నాలుగైదు రోజుల్లో పూర్తి స్థాయిలో శాఖల వారీగా కేటాయింపులు పూర్తి చేయనున్నారు. ఇలా జిల్లాస్థాయిలో ఉండాల్సిన మొత్తం 63 విభాగాల కార్యాలయాలను ఈనెలాఖరులోగా గుర్తించే దిశగా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. మరోవైపు జనవరి మొదటికి జిల్లా అధికారికంగా ప్రకటించడం, వెంటనే కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం జనవరి 26వ తేదీ బెంగళూరు రోడ్డులోని బీటీ కళాశాల మైదానంలో గణతంత్ర వేడుకలు నిర్వహించేలా అధికారులు ముందుకెళ్తున్నారు.




సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న అటవీ శాఖ కార్యాలయం - సాంఘిక సంక్షేమ హాస్టల్

సిరికల్చర్ భవనాల పరిశీలన...

మదనపల్లె టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ఏర్పాటులో భాగంగా మదనపల్లె పట్టణంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన హెచ్‌వోడీ కార్యాలయాలు, మదనపల్లె ఆర్డీవో కార్యాలయం నిర్వహణ కోసం భవనాల ఎంపికకు సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి పలుచోట్ల పరిశీలించారు. బుధవారం స్థానిక బెంగళూరు రోడ్డులోని సిరికల్చర్ (పట్టుగూళ్ల ఉత్పత్తి కేంద్రం) భవనాల్లో ఉన్న 19 గదులను సబ్‌కలెక్టర్ పరిశీలించారు.

ఈ గదులు పొడవు, వెడల్పు, భవనం పైభాగాన మోల్డింగ్ స్థితిని సబ్ కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. వీటితో పాటు మడికయ్యల శివాలయం వీధిలో ఉన్న బీటీ కళాశాల బాయ్స్ పీజీ హాస్టల్ భవనాలను పరిశీలించారు. అక్కడ ఆవరణలో ఉన్న కంపచెట్లను ఎక్స్‌కవేటర్‌తో క్లీన్ చేయించారు. అనంతరం ఆయా భవనాల స్కెచ్‌లను తయారు చేయాలని సచివాలయ సర్వేయర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ బాలసుబ్రమణ్యం, సర్వేయర్ సుబ్రమణ్యం, వీఆర్‌వోలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి

మార్కెట్ కమిటీ షాపింగ్ కాంప్లెక్స్
అద్దె బకాయి రూ.10.8 లక్షలు

పీలేరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ షాపింగ్ కాంప్లెక్స్ అద్దె బకాయి రూ.10.8 లక్షలకు చేరుకుంది. మార్కెట్ కమిటీ అధికారుల ఉదాసీనత వల్లే నెలనెలా చెల్లించాల్సిన అద్దె చెల్లింపులో తీవ్ర జాప్యం నెలకొందని ఆరోపణలు ఉన్నాయి. పీలేరు మార్కెట్ కమిటీకి నెలనెలా షాపింగ్ కాంప్లెక్స్, గోడౌన్ల ద్వారా నెలకు సుమారు రూ.4,72,056 వస్తుంది. దీని ద్వారానే ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర ఖర్చులకు వాడుతున్నారు. అయితే కాంప్లెక్స్‌లో షాపుల యజమానుల నుంచి కొన్ని షాపులలో నెలల తరబడి అద్దె బకాయిలు ఉండడం గమనార్హం. షాపుల యజమానుల నుంచి అద్దె వసూలు చేయడంలో మార్కెట్ కమిటీ అధికారుల విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి.

ఉత్పత్తిదారులకు వరం ఎంఎస్ఎంఈ

ఇండస్ట్రియల్ జిల్లా జనరల్ మేనేజరు కృష్ణకిశోర్



సమావేశంలో పాల్గొన్న ఇండస్ట్రియల్ జీఎం కృష్ణకిషోర్

మదనపల్లె అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ పరిశ్రమల ఉత్పత్తిదారులకు గొప్పవరమని ఇండస్ట్రియల్ జిల్లా జనరల్ మేనేజరు కృష్ణకిషోర్ అన్నారు. గొల్లపల్లె బైపాస్ రోడ్డులోని శ్రీరస్తు కల్యాణమండపంలో బుధవారం యువతకు అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న చిన్న, మధ్య తరహా పరిశ్రమల తయారీ కేంద్రాలను పెడుతున్న వారికి ఆర్థికంగా చేయూతనిస్తున్న ఎంఎస్ఎంఈ సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తున్నామని, దీనివల్ల వారు ఏర్పాటు చేసుకున్న ప్రాజెక్టులను ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. ఏపీ ఎంఎస్ఎంఈ ద్వారా నిర్దేశించిన బ్యాంకుల ద్వారా రాయితీ రుణాలు మంజూరవుతాయని, కావున అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమం ద్వారా మదనపల్లెలో ఉచిత సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ సిబ్బంది, పరిశ్రమల లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు తంబళ్లపల్లె ఎంపీపీ ఉప ఎన్నిక

తంబళ్లపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ఎంపీపీ ఉప ఎన్నిక గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాపూజీ పట్నాయక్ తెలిపారు. తంబళ్లపల్లె ఎంపీపీ అనసూయమ్మ వ్యక్తిగత కారణాల వలన ఈ ఏడాది అక్టోబరు 13న తన ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. దీంతో మండలంలోని ఎంపీటీసీల ఆమోదంతో కోసువారిపల్లె ఎంపీటీసీ చిటికి శ్యామలమ్మను ఇన్‌చార్జ్ ఎంపీపీగా అక్టోబరు 27న ఎంపీడీవో ప్రమాణం చేయించారు. అవిశ్వాస తీర్మానం, రాజీనామా తదితర కారణాలతో రాష్ట్రంలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయడానికి ఈనెల 11వ తేదీ ఎంపీపీ ఉప ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 11 గంటలకు తంబళ్లపల్లె మండలంలో ఉన్న 11 మంది ఎంపీటీసీల కోరంతో నియోజకవర్గ ప్రత్యేకాధికారి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కాగా తంబళ్లపల్లె మండలంలో మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలు ఉండగా అన్ని స్థానాల్లో వైసీపీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎస్‌ఐ ఉమామహేశ్వరరెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రికెట్ జిల్లా జట్టుకు మదనపల్లె విద్యార్థి



మదనపల్లె టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు చిత్తూరు జిల్లా జట్టుకు మదనపల్లె విద్యార్థి ఎంపికయ్యాడు. బుధవారం పీలేరులో నిర్వహించిన అండర్-17 విభాగం డివిజన్ స్థాయి క్రికెట్ పోటీల్లో మదనపల్లెలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి తారీష్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపరిచాడు. సెలెక్టర్లు అతడిని చిత్తూరు జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరెస్పాండెంట్లు అమృత, శ్రీదేవి మాట్లాడుతూ గురువారం చిత్తూరులో నిర్వహించే జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో తారీష్ పాల్గొంటాడని, అక్కడ ప్రతిభ చూపితే రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యే అవకాశం ఉందన్నారు.


ప్రకృతి వ్యవసాయ సూత్రాలు అమలు చేయాలి



మాధవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న డీపీఎం

రాయచోటిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేస్తున్న పంటల విధానంలో గ్రామ స్థాయి నుంచి ప్రకృతి వ్యవసాయ సూత్రాలను అమలు చేయాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ తెలిపారు. రాయచోటి పట్టణంలోని ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ న్యాచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్‌ఎఫ్) ఆధ్వర్యంలో ప్రారంభమైన ఐదు రోజుల శిక్షణలో భాగంగా బుధవారం రెండోరోజు డీపీఎం మాట్లాడుతూ ఐసీఆర్‌పీలు నిర్వహించాల్సిన విధులు, బాధ్యతల గురించి సమగ్రంగా వివరించారు. గ్రామ స్థాయిలో ప్రకృతి వ్యవసాయ సూత్రాలను రైతుల వద్దకు చేర్చడంలో ఐసీఆర్‌పీలు కీలకపాత్ర పోషించాలన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ప్రయోజనాలు రసాయన రహిత పంటల ద్వారా భూమి సారాన్ని కాపాడడం, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం వంటి అంశాలను వివరించారు. శిక్షణలో భాగంగా రాయచోటి మండల పరిధిలోని మాధవరం గ్రామం బలిజపల్లెలో ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి అనే రైతు పొలంలో ఏటీయం మోడల్, ఏ గ్రేడ్ మోడల్ వేరుశనగ పంటలను పరిశీలించారు. అనంతరం ఇన్‌పుట్ ప్రిపరేషన్‌పై ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, సీడ్ ఫెర్టిలైజేషన్ తయారీ విధానం, వాటి ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎన్‌ఎఫ్‌ఏ చిరంజీవి, ఎఫ్‌ఎంటీలు, ఐసీఆర్‌పీలు మండల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్జీవో అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక



ఎన్జీవో అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ సభ్యులు

రాయచోటిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక బుధవారం జరిగింది. ఈ సందర్భంగా రాయచోటి పట్టణంలోని ఎన్జీవో హోంలో చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవులు, రమేశ్, వై.ప్రసాద్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. నామినేషన్ల ప్రక్రియ అనంతరం ఒక్కొక్క పోస్టుకు ఒక్కో అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయగా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి రాఘవులు ప్రకటించారు. ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు ఎన్నికలను పర్యవేక్షించారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సహాధ్యక్షుడిగా డీవీ శివారెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.మహదేవ, ఈ.నరసింహ, సిద్దయ్య, గణేశ్, ధీరజ్, స్వర్ణలత, కార్యదర్శిగా జె.శ్రీనివాసన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.హరిప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా రాజశేఖర్ రెడ్డి, వంశీప్రసాద్, సందీప్‌కుమార్‌రెడ్డి, విజయలక్ష్మి, జ్యోతి, సంయుక్త, కార్యదర్శిగా అంజనమ్మ, కోశాధికారిగా నాగేశ్వర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రైల్వేకోడూరు, రాజంపేట, పీలేరు, మదనపల్లె, వాల్మీకిపురం తాలూకాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి ఉంటే పార్టీకి రాజీనామా చేయాలి

రాజంపేట జిల్లా సాధన జేఏసీ సమావేశంలో చమర్తి జగన్‌మోహన్‌రాజు



రిలే దీక్షల్లో సంఘీభావం తెలుపుతున్న జగన్‌మోహన్‌రాజు, అతికారి కృష్ణ తదితరులు

రాజంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా జిల్లాల విభజన చేసి రాజంపేటకు అన్యాయం జరిగినప్పుడు స్థానిక వైసీపీ నాయకులు ఏమాత్రం నోరుమెదపకుండా ఈ ప్రాంతానికి అన్యాయం చేశారని, వారికి చిత్తశుద్ధి ఉంటే వైసీపీకి రాజీనామా చేసి రాజంపేట ప్రజలకు క్షమాపణ చెప్పాలని రాజంపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. బుధవారం రాజంపేట పాతబస్టాండులో జిల్లా సాధన సమితి జేఏసీ ఏర్పాటు చేసిన రిలే దీక్షల శిబిరానికి హాజరై తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జిల్లా విషయంపై తప్పు చేశారని బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం మరోసారి వైసీపీ దీక్షల నాటకం ఆడుతూ మరోమారు రాజంపేటకు అన్యాయం చేయడానికి పూనుకున్నారని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ తప్పిదాలే రాజంపేటకు శాపంగా మారాయన్నారు. వైసీపీ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు భూకబ్జాలకు పాల్పడి కోట్లు సంపాదించి ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. రాజంపేట గొంతుకోసి తిరిగి కాపాడమని అరిస్తే ఎలా అని ప్రశ్నించారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి వైసీపీ హయాంలో కొత్త జిల్లాలు ఏర్పాటు చేసినప్పుడు జడ్పీ చైర్మన్‌గా ఉండి రాజంపేట జిల్లా కేంద్రం కావాలని ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. వైసీపీ నేతలు ఉమ్మడి కడప జిల్లాను విభజించినప్పుడే రాజంపేటను జిల్లా కేంద్రం చేసి ఉంటే ఇంత ఇబ్బంది ఉండేదా అన్నారు. రాజంపేట జిల్లా కోసం చిత్తశుద్ధితో చేసే పోరాటాలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. అందరూ కలిసి వస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ వద్దకు వెళ్లి తన జిల్లా వ్యవహారంపై అభ్యర్థిస్తామన్నారు. జనసేన పార్లమెంట్ నాయకుడు అతికారి కృష్ణ మాట్లాడుతూ రాజంపేట జిల్లా సాధనకు జనసేన పార్టీ అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. రాజీలేకుండా పోరాడుదామని పిలుపునిచ్చారు.

కూటమి నేతల ఆధ్వర్యంలో రిలే దీక్షలు ప్రారంభం

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ రాజంపేట పాతబస్టాండు ప్రాంతంలో కూటమి రిలే దీక్షలు ప్రారంభించారు. జేఏసీ నాయకులు, కూటమి నాయకులు ఈ రిలే దీక్షకు మద్దతు ప్రకటించారు. దీక్షా శిబిరంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూల విజయభాస్కర్, ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు అబ్బూరు ప్రభాకర్‌నాయుడు, సీపీఐ నాయకులు సికిందర్, సీపీఎం నాయకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని పోలీసుల సంక్షేమమే లక్ష్యం : ఎస్పీ



బ్యాంకు ప్రతినిధుల సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. బుధవారం ఎస్పీ పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రతినిధులతో జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది, అధికారులతో, హోంగార్డ్స్ 24 గంటలు విధి నిర్వహణలో నిమగ్నమై ఉంటారన్నారు. ఈ ఒత్తిడిలో కూడిన వాతావరణంలో సిబ్బందికి ఏవైనా అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వారికి మెరుగైన ఆరోగ్య భద్రత (హెల్త్ ఇన్సూరెన్స్) అందించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ నేపథ్యంలో ఆయా బ్యాంకులు తమ ఉద్యోగులకు అందిస్తున్న అత్యుత్తమ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీల వివరాలను త్వరితగతిన క్లెయిమ్ అయ్యే బీమా పథకాల గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. పోలీసు సంక్షేమం కోసం బ్యాంకులు అందించే అన్ని రకాల సేవలు, రాయితీలపై కూడా ఈ సందర్భంగా ఎస్పీ చర్చించారు. అలాగే త్వరలోనే పోలీసు సిబ్బంది కోసం ఒక అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తామని, ఆ సదస్సులో తమ ఆరోగ్య బీమా పథకాల పూర్తి వివరాలను, ప్రయోజనాలను సిబ్బందికి స్పష్టంగా తెలియజేయాలని బ్యాంక్ ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో ఎస్బీఐ, యాక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రతినిధులతో పాటు, ఏఏవో త్రినాథ సత్యం, ఆర్‌ఐ వెల్ఫేర్ ఎం.పెద్దయ్య, ఎస్పీ సీసీ ఉదయ్‌కుమార్, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లెలో మిస్సింగ్..
శ్రీనివాసమంగాపురంలో హత్య

చంద్రగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మిస్సింగ్ అయిన వ్యక్తి.. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురంలో హత్యకు గురయ్యాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె రూరల్‌కు చెందిన ఆవుల నరసింహులు, నాగరాజు, కత్తి నరసింహులు, నారాయణస్వామి.. చంద్రగిరి మండలం నరసింగాపురానికి చెందిన మునిరాజ స్నేహితులు. వీళ్లు తాంత్రిక వైద్యం, గుప్త నిధుల తవ్వకాలు చేస్తుంటారు. అయితే ఆవుల నరసింహులు.. తన భార్యతో సన్నిహితంగా ఉండటంపై నాగరాజు ఆగ్రహించాడు. ముందస్తు పథకం ప్రకారం అక్టోబరు 27వ తేదీ చంద్రగిరిలో తాంత్రిక వైద్యం చేయాలని ఆవుల నరసింహులు, నారాయణస్వామి, కత్తి నరసింహులను మదనపల్లెలో బస్సు ఎక్కించి పంపించాడు. వాళ్లకు తెలియకుండా వెనక మరో బస్సు ఎక్కి శ్రీనివాసమంగాపురంలో నాగరాజు దిగాడు. నరసింగాపురంలోని మునిరాజకు ఫోన్ చేసి ద్విచక్ర వాహనం తీసుకురమ్మని చెప్పాడు. అనంతరం ఆవుల నరసింహులు ఒక్కడినే శ్రీనివాసమంగాపురానికి పిలిపించారు. ద్విచక్ర వాహనంలో అతడిని ఎక్కించుకుని.. మామిడి తోపులోకి నాగరాజు, మునిరాజ తీసుకెళ్లారు. అక్కడ హత్య చేసి పూడ్చి వేశారు. ఆవుల నరసింహులు కనిపించడం లేదని మదనపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా స్నేహితులనూ విచారించగా.. నాగరాజు, మునిరాజు హత్య చేసినట్లు తెలిసింది. దీంతో మదనపల్లె పోలీసులు గురువారం నిందితులను తీసుకొచ్చి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఓబులవారిపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కొర్లకుంట రైల్వే వంతెన సమీపంలో నిలిచి ఉన్న లారీని ఢీకొని ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నఓరంపాడు పంచాయతీ అయ్యలరాజుపల్లెకు చెందిన సి.శ్రీనివాసులరెడ్డి అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో రైల్వేకోడూరు వైపు నుంచి గ్రామానికి వస్తుండగా నిలిపి ఉన్న లారీని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని కుటుంబ సభ్యులు రైల్వేకోడూరు ఆస్పత్రికి తరలించారు.

ఎప్పటికి పూర్తవుతుందో...?

- నత్తనడకన అన్న క్యాంటీన్ భవన నిర్మాణం
- నిర్మాణానికి రూ.61 లక్షలు మంజూరు
- జూలై నుంచి ముందుకు సాగని పనులు

పీలేరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు రూ.5కే కడుపునిండా రుచికరమైన భోజనం పెట్టాలన్న ఉన్నతమైన ఆశయంతో అన్న క్యాంటీన్ పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా పలు నియోజకవర్గాలలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. హోటళ్లకు వెళ్లి వందలాది రూపాయలు వెచ్చించి ఆకలి తీర్చుకోలేని పేదల పాలిట అన్న క్యాంటీన్ ఓ వరంగా మారింది. నిత్యం వేలాదిమంది పేదలు అన్న క్యాంటీన్లలో అతి తక్కువ ధరకే రుచికరమైన ఆహారంతో తమ ఆకలి తీర్చుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో రెండో విడతలో భాగంగా పీలేరు నియోజకవర్గానికి అన్న క్యాంటీన్ మంజూరు చేయించారు. ఇందులో భాగంగా నియోజకవర్గ కేంద్రమైన పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో క్యాంటీన్ నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించారు. అనంతరం ప్రభుత్వం భవన నిర్మాణం కోసం రూ.61 లక్షలు నిధులు మంజూరు చేసింది. నిధులు మంజూరైనా భవన నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ ఏడాది జూలై 10వ తేదీ భవన నిర్మాణానికి పీలేరులో భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. దీంతో భవన నిర్మాణం మూడు నెలల్లో పూర్తి చేసి నవంబరు నుంచి అన్న క్యాంటీన్ పేదల ఆకలి తీర్చడం కోసం అందుబాటులోకి వస్తుందని అందరూ భావించారు. భవన నిర్మాణ ప్రారంభం నుంచి పనులు నత్తనడకన సాగుతుండడంతో ఎప్పటికి నిర్మాణం పూర్తి చేస్తారో అన్న అనుమానం స్థానిక టీడీపీ నేతల్లో నెలకొంది. ప్రారంభం నుంచి మూడు నెలల వ్యవధిలో అక్టోబరు 10 నాటికి క్యాంటీన్ నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు సగం పనులు కూడా పూర్తి కాకపోవడంతో సర్వత్రా నిరుత్సాహం నెలకొంది. ఐదు నెలలైనా సగం పనులు కాలేదు. నవంబరు నాటికీ అన్న క్యాంటీన్ అందుబాటులోకి వస్తుందని అందరూ భావించారు. అయితే ఆ దిశగా పనులు ముందుకు సాగకపోవడంతో అన్న క్యాంటీన్ ఎప్పటికో అన్న అనుమానం అందరూ వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్, నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక చొరవ చూపి పనులు వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నత్తనడకన సాగుతున్న అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులు

అరటి ధరలు.. ధమాల్

- ఆందోళనలో అన్నదాతలు
- సాగు పెట్టుబడి రాని వైనం
- ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూపులు


మిన్నయ్యగారిపల్లె వద్ద సాగు చేసిన అరటి

పెండ్లిమర్రి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన అరటి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు దిగాలు చెందుతున్నారు. ఏ పంట సాగు చేసినా పంట చేతికి వచ్చే సమయానికి ధరలు పతనం అవుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కనీసం సాగు కోసం పెట్టిన పెట్టుబడి కూడా అందక అన్నదాతలు.. ఇక మాకు ఆత్మహత్యలే శరణ్యమంటూ గగ్గోలు పెడుతున్నారు. వివరాల్లోకి వెళితే..

ఈ ఏడాది ఉల్లి, మిరప, టమోట, నిమ్మ ఇలా ఏ పంట సాగు చేసినా రైతులకు ఫలితం దక్కడం లేదు. ఇక అరటి ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. మూడు నెలల కిందట టన్ను రూ.20 వేలు పలికిన ధర నేడు టన్ను రూ.3 వేలకు పడిపోయింది. మన ప్రాంతంలో పండించే అరటికి ఇతర రాష్ట్రాలకు ఎక్స్‌పోర్టు లేకపోవడం, అక్కడ నుంచి అంతర్జాతీయ మార్కెట్‌లో విస్తారంగా అరటిపండ్లు లభిస్తుండటంతో మన పంటకు డిమాండ్ లేక పోవడం ప్రదాన కారణం.

మండలంలోని నాగాయపల్లె, చీమలపెంట, నందిమండలం, చెర్లోపల్లె తదితర గ్రామాల్లో ఎక్కువగా అరటి పంటను సాగు చేస్తారు. మొదటిసారి సాగు చేసిన పంట కోతకు వచ్చే సమయానికి 9 నెలల కాలం పడుతుంది. దుక్కిదన్నడంతో మొదలు ఎరువులు, పురుగుల మందులు, కలుపు, డ్రిప్ తదితర ఖర్చులతో ఎకరా అరటి సాగు చేసేందుకు లక్ష రూపాయలు ఖర్చు అవుతుంది. ఎకరాకు 1000 అరటి పిలకలు నాటాలి. మండలంలో భూసారాన్ని బట్టి ఒక్కో గెల 25 నుంచి 30 కేజీల వరకు ఉంటుంది. ఎకరాకు 30 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ధరలు బాగా ఉంటే ఖర్చులు పోను రైతులకు మంచి ఆదాయం వస్తుంది. అలా అదే భూమిలో తక్కువ సమయంలో రెండు మూడు కోలెలు సాగు చేసుకోవచ్చు. అయితే పండిన పంటను అడిగే దిక్కులేక ప్రభుత్వ సాయం కోసం రైతన్నలు ఎదురు చూపులు చూస్తున్నారు.



కోల్డ్‌స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలి

ధరలు లేనప్పుడు పండించిన పంటను నిలువ ఉంచుకునేందుకు ప్రభుత్వం కోల్డ్‌స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలి. ఉద్యాన రైతులను దృష్టిలో పెట్టుకుని కోల్డ్‌స్టోరేజ్‌లు ఏర్పాటు చేస్తే ధరలు వచ్చినపుడు అమ్ముకునే వెసలు బాటు ఉంటుంది.

-జి.గోపాల్‌రెడ్డి, రైతు, మిన్నయ్యగారిపల్లె.



గిట్టుబాటు ధర కల్పించాలి

మా ప్రాంతంలో రైతులు ఎక్కువగా ఉద్యాన పంటలను సాగు చేస్తారు. పంట చేతికి అంది వచ్చే సమయానికి ధరలు లేక సాగు పెట్టుబడులు కూడా రావడం లేదు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించాలి.

-రమణారెడ్డి, రైతు, నాగాయపల్లె

పునుగు పిల్లి ప్రత్యక్షం...

- పట్టుకునేందుకు చేసిన ప్రయత్నం విఫలం


సెప్టిక్ ట్యాంకులో పడిన పునుగు పిల్లి

కడప ఎన్టీఆర్‌సర్కిల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరానికి సమీపంలో అరుదైన పునుగు పిల్లి ప్రత్యక్షమైంది. అటవీశాఖ అధికారులు దాన్ని పట్టుకునేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. వివరాల్లోకి వెళితే.. ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు కానీ బుధవారం కడప సెంట్రల్ జైలు సమీపంలో ఉన్న జగనన్న కాలనీలో గల డి-బ్లాక్‌లోని ఓ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సెప్టిక్‌ట్యాంకులో పునుగు పిల్లి పడింది. లోతు ఎక్కువగా ఉండడంతో బయటికి రాలేక అక్కడే ఉండిపోయింది. స్థానికుల సమాచారంతో అటవీశాఖ అటవీశాఖ బీట్ ఆఫీసర్ పార్వతి మరికొంత మంది సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పునుగు పిల్లిని రక్షించి అడవిలో వదిలేందుకు ప్రయత్నించారు. మొదట ఒక బకెట్ కట్ చేసి.. సంచి తగిలించి దాన్ని బయటికి తీయాలని ప్రయత్నించగా వీలు కాలేదు. అనంతరం నిచ్చెనను గుంతలోకి దింపారు. దాని ద్వారా బయటికి పునుగు పిల్లి వచ్చినా... ఎవరికీ చిక్కకుండా పారిపోయింది. దీంతో పునుగు పిల్లిని స్వాధీనం చేసుకునేందుకు అటవీశాఖ అధికారులు చేసిన ప్రయత్నం విఫలమైంది.

అసలైన నిందితులెవరో నిగ్గుతేల్చాలి

- వైసీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డి

కడప మారుతీనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తల్లిని, చెల్లినీ తిట్టిన అసలైన నిందితులెవరో నిగ్గుతేల్చాలని వైసీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డి ప్రభుత్వాన్ని, పోలీసులను కోరారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఆ ఇద్దరినీ తాను సోషల్‌మీడియాలో తిట్టానంటూ పోలీసులు అన్యాయంగా కేసులో ఇరికించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తాను పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో 2024 ఫిబ్రవరిలో ఫిర్యాదు చేశానన్నారు. అప్పట్లో ఎస్పీగా ఉన్న సిద్ధార్థ కౌశల్, పులివెందుల సీఐ శంకర్‌రెడ్డి కేసు నమోదు చేసి నిందితులను పట్టుకున్నారన్నారు. ఆ రోజు అరెస్టయిన నిందతులపై క్రైం నెంబర్ 45/2024గా కేసు నమోదు చేశారన్నారు. అయితే దానిపై పోలీసులు ఇప్పటికీ చార్జిషీట్ వేయలేదని, నిందితులు ఎవరనే సంగతిని బయటకు చెప్పడం లేదన్నారు. అదే విషయంగా తెలంగాణలో కూడా తనపై కంప్లయింట్ ఉందన్నారు. ఇప్పటికైనా పోలీసులు, ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపించి తనకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న మోటార్ సైకిల్

- ఇద్దరు యువకుల మృతి
- మహారాష్ట్రకు చెందిన వారిగా గుర్తింపు

ఎర్రగుంట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బతుకు దెరువు కోసం వచ్చిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. బుధవారం సాయంత్రం ఎర్రగుంట్ల పట్టణంలో ఆర్టీసీ బస్సును మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఈ సంఘటన జరిగింది. మృతులు మహరాష్ట రాష్ట్రానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. వివరాల్లోకెళితే...

మహారాష్ట్ర రాష్ట్రం చంద్రాపూర్ జిల్లాకు చెందిన కరన్ విలాస్ తెలంగి(23), వినాయక్ శ్రవన్ చుడారి(34)లు పదిరోజుల క్రితం పనిచేసుకునేందుకు ఎర్రగుంట్లకు వచ్చారు. జువారీ కర్మాగారం లేబర్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. బుధవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఎర్రగుంట్ల-ముద్దనూరు రోడ్డులోని బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో మోటార్‌బైక్‌పై ఇద్దరు కలిసి వెళుతున్నారు. అదే సమయంలో సింహాద్రిపురం నుంచి ప్రొద్దుటూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సును ముందు భాగంలో ఢీకొన్నారు. దీంతో ఇద్దరు ఎగిరి రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఒకరు వెంటనే చనిపోయాడు. మరొకరు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా 108 సిబ్బంది వచ్చి పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ నాగమురళి సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. అప్పటికే ఏం జరిగిందో తెలియక జనం గుమికూడడం, పాఠశాలలు వదిలే సమయం కావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు క్లియర్ చేయించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్టీసీ డ్రైవర్ పరదేశిరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుల కుటుంబాలకు సమాచారం ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.


సంఘటనా స్థలంలో యువకుల మృతదేహాలు, పరిశీలిస్తున్న పోలీసులు, స్థానికులు

రీసర్వేలో అవకతవకలపై విచారణ


రైతులతో మాట్లాడుతున్న జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ

కొండాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకయ్యకాలువ గ్రామంలోని భూముల రీసర్వేలో గతంలో జరిగిన అవకతవకలపై జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ బుధవారం విచారణ చేపట్టారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వెంకయ్యకాలువ గ్రామానికి చెందిన రైతులతో సమావేశమయ్యారు. కాగా, రీ సర్వే అవకతవకలపై రైతులు ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆమె సర్వే అధికారులతో కలిసి రైతులతో మాట్లాడారు. గతంలో భూముల రీసర్వే చేసినప్పుడు తప్పులు జరిగాయని, తమకు న్యాయం చేయాలని రైతులు ఆర్డీవోను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ గురప్ప, సర్వే అధికారులు పాల్గొన్నారు.

బుడ్డశనగకు తడివేరు తెగుళ్లు

- రైతులను అప్రమత్తం చేసిన అధికారులు



రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి అన్నదాతలకు సూచనలు, జాగ్రత్తలను అందించారు. ప్రొద్దుటూరు మండల పరిధిలో బుడ్డశనగ పంట ఇప్పటికే ఆరు వేల ఎకరాలకు పైగా రైతులు సాగు చేస్తున్నారు. వీటి విస్తీర్ణం మరో రెండు వేల వరకు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారుల అంచనా. మండల పరిధిలోని చౌడూరు, పెద్దశెట్టిపల్లె, బొల్లవరం, దొరసానిపల్లె, తదితర పంచాయతీల్లో అధికంగా రైతన్నలు పంట సాగు చేశారు. ప్రస్తుతం పైరు శాకోపదశలో ఉంది. ఈ దశలో పంటకు వ్యాపిస్తున్న తడివేరు తెగులును మండల వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ సాంబవర హరికుమార్ గుర్తించారు. దీనిని నివారించేందుకు లీటరు నీటికి వంద గ్రాముల టెక్సాకొనజోల్, రెండు మిల్లీలీటర్ల చొప్పున 19.19.19 ఎరువుతో కలిపి పిచికారి చేయాలన్నారు. ఇతర సందేహాలకు తమను సంప్రదించవచ్చన్నారు.

పుస్తక జ్ఞానంతో పాటు సామాజిక అవగాహన అవసరం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పుస్తక జ్ఞానంతో పాటు సామాజిక అవగాహన కూడా అవసరమని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో 75 సంవత్సరాలలో మానవ హక్కులు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో వీసీ మాట్లాడుతూ హక్కులు బాధ్యతలను సమానంగా స్వీకరించాలన్నారు. కీలక ఉపన్యాసకురాలైన డాక్టర్ ఎ. సునీత మానవ హక్కుల ప్రకటన చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. దేశంలో పెరుగుతున్న జాతీయ వాదం, పౌరుల విభజన వంటి ధోరణులు ప్రమాదకరమని, అవి జాతి హననానికి దారితీసే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్, కాశ్మీర్ పరిణామాలను ఉదాహరణగా పేర్కొన్నారు. సర్ పేరుతో ఓటర్ నమోదు ప్రక్రియలో దళిత-ఆదివాసీ వర్గాలకు అన్యాయం జరుగుతోందని చెప్పారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ హక్కుల అమలుకు ప్రజల్లో అవగాహన ముఖ్యమని చెప్పారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్, కన్వీనర్ డాక్టర్ బీఆర్ సతీష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్

మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ తెలిపారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో డిజిటల్ హింస నిర్మూలనకు ఐక్యమవుదాం అనే అంశంపై 16 రోజుల క్రియాశీలతలో భాగంగా వెబినార్ నిర్వహించారు. లైంగిక వేధింపుల నిరోధక అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ మహిళా భద్రతా సెల్ సూపరింటెండెంట్ (సీఐడీ) ఐపీఎస్ రత్న వెలిసెల డిజిటల్ హింస, ఆన్‌లైన్ వేధింపుల రకాలు, ఐటియాక్ట్‌లోని శిక్షా నిబంధనలపై అవగాహన కల్పించారు. నేర తీవ్రతను బట్టి ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రెండు లక్షల రూపాయల వరకు జరిమానా పడే అవకాశం ఉందన్నారు. సైబర్ క్రైమ్ పోర్టల్, శక్తివారియర్, ఈగిల్ వంటి వేదికలను బాధితులు ఉపయోగించుకోవాలన్నారు.

డిజిటల్ మార్కెటింగ్‌లో ఉచిత శిక్షణ

కడప కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప కలెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాలు (ఎస్సీ) నిరుద్యోగ యువతీ యువకులకు డిజిటల్ మార్కెటింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రాకేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఆపై చదివిన షెడ్యూల్ కులాలకు చెందిన 18-40 ఏళ్లలోపు యువతీ యువకులు శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణకు అవసరమైన సామగ్రి, శిక్షణ అనంతరం ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ఈనెల 13వ తేదీలోపు మోడల్ కెరీర్ సెంటర్, ఎంప్లాయిమెంట్ ఆఫీసు, కడపలో గల న్యాక్ శిక్షణా కేంద్రాలలో సమగ్ర సమాచారం పొందవచ్చన్నారు. వివరాలకు 9985142155, 9618177697 నెంబర్లను సంప్రదించాలన్నారు.

జాతీయస్థాయి పోటీలకు కోడూరు విద్యార్థి


విద్యార్థి యతిన్‌చందన్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

రైల్వేకోడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మోదుకూరులో ఈనెల 6, 7, 8 తేదీల్లో నిర్వహించిన అండర్-19 రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో కోడూరుకు చెందిన ఎస్వీ జూనియర్ కళాశాల విద్యార్థి సి.యతిన్‌చందన్ ప్రతిభ ప్రదర్శించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జనవరి మూడో వారంలో మహారాష్ట్రలో నిర్వహించనున్న పోటీలో పాల్గొంటాడని బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎన్ శ్రీనివాసులు, డైరెక్టర్ వసుంధర తెలిపారు. అనంతరం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

కలివికోడి పరిహారం పెండింగ్ భూముల పరిశీలన


భూములను పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

అట్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంబళ్లగొంది లో కలివికోడి పరిహారం అందని రైతుల భూములను బుధవారం అన్నమయ్య జిల్లా జేసీ, జీఎన్ఎస్ఎస్ స్పెషల్ కలెక్టరు ఆదర్శ రాజేంద్రన్ పరిశీలించారు. 2008లో కలివికోడి పరిహారం అందని కొంత మంది రైతులు కోర్టును ఆశ్రయించడంతో వారి భూములను పరిశీలించారు. కార్యక్రమంలో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, ఎస్‌డీసీ యూనిట్-2 నీలరా మయ్య, అట్లూరు డిప్యూటీ తహసీల్దారు శిరీషా, వీఆర్వో వెంకటసుబ్బమ్మ, వీఆర్ఏ రాము పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



ఖాజీపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని చెర్లోపల్లె రోడ్డు సమీపంలో ఆర్టీసీబస్సు ఢీకొన్న సంఘటనలో బింగిమల్ల శివకుమార్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఖాజీపేటకు చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు శివకుమార్ పని నిమిత్తం చెర్లోపల్లెకు వెళ్లి తిరిగి వస్తుండగా మైదుకూరు నుంచి కడపకు వెళుతున్న ఆర్టీసీ అద్దె బస్సు స్కూటర్‌ను ఢీకొంది. దీంతో శివకుమార్ వెనుకటైరు కింద కాలు పడడంతో నుజ్జు నుజ్జు అయింది. చికిత్స నిమిత్తం 108 ద్వారా కడప రిమ్స్‌కు తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు వారి బంధువులు తెలిపారు.

జిల్లా హాకీ జట్టుకు ఎంపికైన జడ్పీ విద్యార్థినులు


ఎంపికైన షర్మిల, శృతిలతో ఎంఈఓ, హెచ్‌ఎం, పీడీలు

పులివెందుల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11, 12, 13 తేదీలలో అండర్-17 బాలికల హాకీ ఇంటర్ జిల్లాస్థాయి పోటీలలో కడప జిల్లా హాకీ జట్టుకు పులివెందుల జడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులు ఎంపికయ్యారు. హెచ్‌ఎం గంగిరెడ్డి, పీడీలు ఫ్రాన్సిస్ తెలియజేస్తూ తమ పాఠశాలకు చెందిన షేక్ షర్మిల, స్టాండ్‌బైగా కె.శృతిలు జిల్లా హాకీ జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 రామానాయుడు, హెచ్‌ఎం గంగిరెడ్డి, పీడీ రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. నెల్లూరులో జరిగే పోటీలలో ప్రతిభచూపి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

మహిళా భద్రతపై అవగాహన

కడప క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళా భద్రతపై పాఠశాల, కళాశాలల్లో బుధవారం పోలీసు అధికారులు, సిబ్బంది విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సమాజంలో మహిళల భద్రత, పోక్సో ప్రాముఖ్యత గురించి వివరిస్తూ బాలికలు ఎదుర్కొనే మానసిక, శారీరక వేధింపుల పట్ల జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో వివరించారు. బాల్య వివాహాలు వల్ల కలిగే మానసిక, శారీరక, సామాజిక నష్టాలపై ఉదాహరణలతో వివరించారు.

13న అంతర్ కళాశాలల పోటీలు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల స్త్రీ, పురుషుల క్రీడా పోటీలు డిసెంబరు 13వ తేదీ ఉదయం 9గంటలకు నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ క్రీడ బోర్డు కార్యదర్శి డాక్టర్ కొవ్వూరు రామసుబ్బారెడ్డి తెలిపారు. వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ క్రీడాంశాలు, పురుషులు బెస్ట్ ఫిజిక్ పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. వ్యాయామ విద్య క్రీడ శాస్త్రాల విభాగంలో నిర్వహించే ఈపోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలన్నారు.

పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల పంటలు దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర కోరారు. రైతాంగ సమస్యలపై రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా బుధవారం కడప ఆర్డీఓ కార్యాలయం వద్ద సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. గాలి చంద్ర మాట్లాడుతూ తేమ శాతం, రంగు మారిందని కుంటి సాకులు చెబుతూ ధాన్యం కొనుగోలు చేయకుండా అనేక కొర్రీలు పెడుతున్నారన్నారు. కనీసం పంటను ఆరబెట్టుకోవడానికి, తడవకుండా కాపాడుకోవడానికి పట్టాలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రం, రైతు సేవ కేంద్రం, రవాణా ఇన్‌చార్జీలు, కస్టోడియన్ ఆఫీసర్లు రైస్ మిల్లర్లతో కుమ్మక్కై ధాన్యం దళారులకు అమ్ముకునే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీంతో 75కేజీల బస్తాను రూ.1200 అమ్ముకొని బస్తాకు రూ.400 నుంచి రూ.500 వరకు నష్టపోతున్నారన్నారు. ధాన్యంతో పాటు పత్తి కొనుగోలు విషయంలో పీఎం యాప్, సీఎం యాప్‌ల పేరుతో అనేక ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలరాజు, కౌలు రైతు సంఘం నాయకులు సుదర్శన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న సీపీఐ, రైతు సంఘం నేతలు

'వాజపేయి విగ్రహ ప్రతిష్ఠను విజయవంతం చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్

మదనపల్లె అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య సర్కిల్‌లో 14వ తేదీన మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజపేయి వందేళ్ల జన్మదినోత్సవం పురస్కరించుకుని చేపడుతున్న విగ్రహ ప్రతిష్ఠను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు సాయి లోకేశ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాజపేయి పాలనలో దేశాభివృద్ధి జరిగిందని, ఉత్తమ ఆలోచనలతో మార్గదర్శకుడిగా నిలిచారన్నారు. దేశంలో మారుమూల ప్రాంతాలకు రోడ్లు, తాగునీటి సౌకర్యాలు అనేక పథకాల ద్వారా అందించిన ఘనత వాజపేయిదే అన్నారు. వాజపేయి పాలనను ఆదర్శంగా తీసుకుని దేశంలో ప్రస్తుత ప్రధాన నరేంద్రమోదీ అమలు చేయనున్నట్లు తెలిపారు. దేశ రాజకీయాల్లో మచ్చలేని మనిషిగా భారతరత్న అవార్డును పొందినగొప్ప మహనీయులు అని అన్నారు. దేశ వ్యాప్తంగా 14న ప్రతి నియోజకవర్గంలో వాజపేయి విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు చల్లపల్లె నరసింహారెడ్డి, యల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, ఓసూరి కిరణ్‌కుమార్, బర్నేపల్లె రవికుమార్, పరీద్‌ఖాన్, పూల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు భూములు పంచాలి

వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టిన ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు, రైతులు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న అసైన్‌మెంట్ భూములు, సీలింగ్ భూములు, ఇరిగేషన్ భూములను భూమిలేని నిరుపేదలకు పంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు మండలంలోని వివిధ గ్రామాల వ్యవసాయ కూలీలు, రైతులతో కలిసి చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద కుటుంబ పేదలకు ప్రభుత్వం భూ పంపిణీ ద్వారా భూములను పంచిపెట్టాలన్నారు. ప్రభుత్వం రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసినా పేదలకు భూములను పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం చేయడంతోనే వైసీపీ ప్రభుత్వాన్ని గ్రామీణ పేదలు ఇంటికి సాగనంపారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూకబ్జాలపైన శ్వేత పత్రం విడుదల చేసి వదిలేయకుండా భూ కబ్జాదారుల వద్ద ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం భూ సీలింగ్ చట్టాన్ని అమలు చేయాలన్నారు. అప్పుడే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా అరికట్ట వచ్చన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో దళితులు, పేదలకు భూములే లేవన్నారు. కనీసం ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అయినా నిరుపేదలకు ఇంటి పట్టాలను మంజూరు చేయాలని కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో దళితుల శ్మశాన వాటికలకు దారి సమస్య, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సహకారం అందించాలన్నారు. వివిధ గ్రామాల్లో దళితులకు శ్మశాన వాటికలు, వాటికి దారి సమస్యలను కూడా పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న భూమి లేని నిరుపేదలకు భూములను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా నేతలు వెంకటాచలపతి, పి. నరసింహులు, నాగరాజు, శ్రీనివాసులు, రోజమ్మ, రమణప్ప, మోసెస్, దీప తదితరులు పాల్గొన్నారు.

'స్క్రబ్ టైఫస్'పై ప్రజలకు అవగాహన

మదనపల్లె అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజలకు అవగాహన అవసరమని డిప్యూటీ హెచ్ఈఓ మహ్మద్ రఫీ అన్నారు. బుధవారం మదనపల్లెలో అర్బన్ పీహెచ్‌సీ రామారావు కాలనీ పరిధి ముజీబ్‌నగర్ సచివాలయం, సీటీఎం పీహెచ్‌సీలో డాక్టర్ ఉమా దేవకృప ఆధ్వర్యంలో ప్రజలకు అవగహన కల్పించారు. స్క్రబ్ టైఫస్ అనేది ఒక చిగ్గర్ పురుగు కాటుతో వచ్చే ఇన్‌ఫెక్షన్ అని, ఐదురోజులు జ్వరం, శరీరంపై నల్లమచ్చలు, తలనొప్పి, శరీరం నొప్పులు ఉండడం వ్యాధి లక్షణాలన్నారు. సోమలి, రామచంద్ర, కిరణ్, కవిత, లావణ్య పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఎంపిక

పెద్దమండ్యం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం కార్యవర్గం ఎన్నికలు జరిగినట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, హసన్ వెల్లడించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా ఫయాజ్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా బాబు, గౌరవ అధ్యక్షుడిగా కె. రమణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జాబీర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించినట్లు తెలిపారు. మండల, జిల్లా సభ్యులు శివకుమార్, వెంకటస్వామి, మదన, నటరాజ, ఖాదర్‌వలి, ప్రశాంతి, పద్మజా, మధవి, ఇందరమ్మ, మీనా, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప గ్రామోత్సవం ప్రశాంతంగా చేయాలి

పీస్ కమిటీలో వెల్లడించిన ఏఎస్పీ వెంకటాద్రి



పీస్ కమిటీలో మాట్లాడుతున్న ఏఎస్పీ వెంకటాద్రి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్వహించే అయ్యప్ప స్వామి గ్రామోత్సవం ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఏఎస్పీ వెంకటాద్రి అన్నారు. బుధవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లెలో హిందూ ముస్లిం, క్రిష్టియన్లు సోదర భావంతో మెలుగుతారని, సనాతన ధర్మం పాటిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తే మానవాళికి శ్రేయస్కరమన్నారు. గ్రామోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అల్లరి మూకలు జొరబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో కుల మతాలకు అతీతంగా ప్రజలు పాల్గొనాలని సూచించారు. గ్రామోత్సవం రూట్ మ్యాప్‌ను ఆలయ ఉత్సవ కమిటీకి అందించామన్నారు. హిందూ, ముస్లిం మైనార్టీ పెద్దలు, క్రిష్టియన్ పాస్టర్లతో నిర్వహించిన పీస్ సమావేశంలో సీఐలు రాజారెడ్డి, కళా వెంకటరమణ, మహమ్మద్‌రఫీ, ఎస్‌ఐలు అన్సర్‌బాషా, చంద్రమోహన్, అయ్యప్ప స్వామి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, జామియా మసీద్ కమిటీ కార్యదర్శి సికిందర్ అలీఖాన్, ముస్లిం మైనార్టీ పెద్దలు, పాస్టర్లు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ పరమేశ్ నాయక్

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దతిప్పసముద్రం ఎస్ఐ పరమేశ్ నాయక్ అన్నారు. బుధవారం పీటీఎం పోలీస్ స్టేషన్ వద్ద ఆటో డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన కల్పించిన ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పని సరిగా నిబంధనలను పాటించాలని, డ్రైవర్లు యూనిఫాం ధరించాలని, ప్రయాణీకుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఆటోల్లో సరుకులు రవాణా చేసే ముందు ఆచి తూచి వ్యవహరించాలని, మద్యం తాగి వాహనాలను నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అన్ని రికార్డులు కలిగి ఉండాలని, అతి వేగంగా బండ్లు నడపరాదని, సామర్థ్యానికి మించి ప్రయాణీకులను ఎక్కించరాదని, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డ్రైవర్లను హెచ్చరించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు క్రమం తప్పక చేయాలి



కార్యాలయానికి చేరిన చెత్త తోపుడు బండ్లు

నిమ్మనపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా చేపట్టాలని ఎంపీడీఓ పక్రుద్దీన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సిబ్బంది ఉదయం 7గంటల నుంచి చెత్త సేకరణ పనులు చేపట్టి గ్రామాలను శుభ్రంగా ఉంచాలని తెలిపారు. కొండయ్యగారిపల్లి, రెడ్డివారిపల్లి-1, రాచవేటివారిపల్లి పంచాయతీలకు చెత్త తరలించేందుకు తోపుడుబండ్లు, ప్లాస్టిక్ పరికరాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వచ్చిన తోపుడు బండ్లను ఆయా పంచాయతీలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

దారి సమస్యపై ఆర్డీఓ విచారణ



అరిగెలవారిపల్లెలో దారి సమస్యను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

గుర్రంకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అరిగెలవారిపల్లెలో పొలాలకు వెళ్లే దారి సమస్యను రాయచోటి ఆర్డీఓ శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన ఇద్దరు రైతుల మధ్య ఏళ్లుగా దారి విషయమై సమస్య ఉంది. దీంతో దారి కోసం రైతు వెంకటరమణ పలుమార్లు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ ఆదేశాలతో రాయచోటి ఆర్డీఓ గ్రామంలో పొలాల దారి సమస్యను పరిశీలించారు. పక్క రైతులను అడిగి వివరాలను సేకరించారు. ఇరువర్గాల రైతులను ఎంపీడీఓ కార్యాలయానికి పిలిపించి భూముల రికార్డులను పరిశీలించి సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. తహసీల్దార్ లక్ష్మీప్రసన్న, ఆర్ఐ సదాశివప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప స్వామి గ్రామోత్సవం



ఆలయంలో మాట్లాడుతున్న అయ్యప్ప ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణ వీధుల్లో గురువారం అయ్యప్ప స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ తెలిపింది. బుధవారం ఆలయంలో నిర్వహించిన సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉదయం 8 గంటలకు అయ్యప్ప స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక రథంపై కేరళవాయిద్యాలు, దేవరెద్దులు, చెక్కభజనల నడుమ గ్రామోత్సవం జరుగుతుందన్నారు. పట్టణంలో కులమతాలకు అతీతంగా ప్రజలు గ్రామోత్సవంలో పాల్గొనాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ స్వామివారిని దర్శించుకుని స్వామికృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'మేథోసంపత్తి హక్కుల సెల్'పై సదస్సు



జాతీయ సదస్సు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కళాశాల యజమాన్యం

మదనపల్లె టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): 'మేథోసంపత్తి హక్కుల సెల్' అంశంపై ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి పేర్కొన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కళాశాలలో నిర్వహించిన పోస్టర్ల ఆవిష్కరణలో డైరెక్టర్ మాట్లాడుతూ 'మేథోసంపత్తి హక్కుల సెల్' అంశంపై ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సు అధ్యాపకులకు ఎంతో ఉపయోగపడుతుని, సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ రామ్మోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ నాగమల్లారెడ్డి, ప్రిన్సిపాల్ పి.రాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణపంచాయతీలోనే పన్నులు చెల్లించాలి : డీఎల్‌డీఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ అమర్‌నాథ్‌రెడ్డి

కురబలకోట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పన్నులను స్వర్ణపంచాయతీ పోర్టల్‌లోనే చెల్లించాలని డీఎల్‌డీఓ అమర్‌నాథ్ రెడ్డి పేర్కొన్నారు బుధవారం కురబలకోటలో స్వామిత్వ సర్వేను తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ పంచాయతీలకు చెల్లించాల్సిన పన్నులు, పన్నేతరములను సకాలంలో వసూలు చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా విధులకు సమయానికి హాజరవాలని, అటెండెన్స్ వేయాలని నిబంధనలను పాటించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందినా వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగయ్య, ఈఓపీఆర్‌డీ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు వేగవంతం చేయాలి



పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీఓ, తదితరులు

కలకడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వర్షకాలం అయినందున గ్రామాల్లో పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ భానుప్రసాద్ సిబ్బందికి సూచించారు. స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి కలకడ, బాలయ్యగారిపల్లి, బాటవారిపల్లి, కదిరాయచెరువు పంచాయతీలకు మంజూరైన చెత్తసేకరణ తోపుడుబండ్లు, బుట్టలను పంపిణీ చేసిన ఆయన మాట్లాడుతూ పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించి, తడి, పొడి చెత్తను వేరుగా సేకరించడంపై శ్రద్ధ వహించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ చక్రపాణి, ఏపీఓ సుజాత, పీడీఓలు శైలజ, దేవేంద్ర, గ్రీన్ అంబాసిడర్లు పాలొన్నారు.

ఉర్దూ అకాడమి చైర్మన్‌కు సన్మానం



చైర్మన్‌ను సన్మానిస్తున్న ఉర్దూ అకాడమి ఉద్యోగులు

మదనపల్లె, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విజయవాడలో బుధవారం జరిగిన ఉర్దూ అకాడమి సమావేశంలో చైర్మన్ మహమ్మద్ ఫరూక్ శుబ్లీని జిల్లా ఉర్దూ అకాడమి ఉద్యోగులు సన్మానించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉర్దూ అకాడమీ సేవలు మరింత బలపడేలా కలిసి పనిచేయాలని చైర్మన్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యగులు అబిద్ హుస్సేన్, ఖాజీ, షరీఫ్, జావిద్, జాహెద్, నసీబ్‌జాన్, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

14లోపు లబ్ధిదారులను గుర్తించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శివశంకరయ్య

పీలేరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల కోసం ఆవాస్ యోజన పథకంలో భాగంగా గుర్తించిన లబ్ధిదారులను తిరిగి చక్కర్‌లో ఈ నెల 14వ తేదీ లోపు ఇళ్లవద్దకే వెళ్లి విచారించాలని పీలేరు ఎంపీడీఓ శివశంకరయ్య, హౌసింగ్ ఏఈ రమణయ్య తెలిపారు. బుధవారం పీలేరు ఎంపీడీఓ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది సమావేశంలో వారు మాట్లాడుతూ రెండో దశలో లబ్ధిదారులు ఇంటి వద్దకే వెళ్లి వారి నివాస స్థితిగతులను పరిశీలించి అవాస్ యోజన 2.0లో నమోదు చేయాలని సూచించారు. మండలంలోని 15 పంచాయతీల నుంచి 3139 మంది లబ్ధిదారులు ఇళ్ల కోసం గుర్తించామని, ఇందులో ఏఐ చక్కర్ ద్వారా రెండో దశ విచారణలో అర్హులను గుర్తిస్తారని తెలిపారు. నిర్ధీత గడువులోపు రెండో దశ విచారణ పూర్తి చేయాలని వారు సూచించారు.

పునాది అభ్యసనం తప్పనిసరిగా ఉండాలి

పెద్దమండ్యం, డిశంబరు 10(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పునాది అభ్యసనం బాగా వుండాలని ఎంఈఓలు మనోహర, రామకృష్ణ పేర్కొన్నారు. పెద్దమండ్యం ప్రాథమిక పాఠశాలలో బుధవారం మండల ఉపాధ్యాయులకు జీఎఫ్ఎల్ఎన్ నిర్వహణ అవగాహన తరగతులు జరిగాయి. ఆ విభాగ రిసోర్స్ పర్సన్ శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు 1వ తరగతి నుంచి 5వ తరగతి లోపు విద్యార్థులకు విద్యా నైపుణ్యం వెలికి తీయడానికి 75 రోజుల విద్యాప్రణాళిక ప్రకారం ఉపాధ్యాయులు చదవించాలన్నారు. ఈ విద్యా సంవత్సరం పూర్తి నాటికి ఒకటవ తరగతి పిల్లవాడు నిమిషానికి 60 సరళ పదాలు, లేదా 40 సరళ పదాలు ధారళంగా చదవాలన్నారు. వర్ణమాలలో వున్న అక్షరాలన్నీ గుర్తించి కలిగి వుండాలన్నారు. మిగతగా తరగతుల విద్యార్థులు కూడా లెక్కలు, ఇంగ్లీష్ చదవాలన్నారు. ఈ తరగతుల నిర్వహణకు ప్రభుత్వం విద్యా సామగ్రిని పాఠశాలలకు అందజేశారని తెలిపారు. మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు తరలిరండి

నిమ్మనపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల సమస్య పరిష్కారానికి 12న కలెక్టరేట్‌లో చేపట్టబోయే ఆందోళనకు అంగన్వాడీలు, ఆయాలు తరలిరావాలని మండల అధ్యక్షులు ముంతాజ్, రాధ పేర్కొన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, మినీ అంగన్వాడీలను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి గ్రాట్యుటీ అమలుకు, మెడికల్ లీవులు, 5జీ సెల్ ఫోన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు. వీటి పరిష్కారం కోసం 12న కలెక్టరేట్‌లో చేపట్టబోయే ఆందోళనకు అంగన్వాడీలు తప్పక హజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక



ఖాదర్‌వలి - జయరాంరెడ్డి

ములకలచెరువు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఖాదర్‌వలి, జయరాంరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షుడిగా కట్టా రమణప్ప, ఆర్థిక కార్యదర్శిగా రహంతుల్లా, గౌరవ సలహాదారుడిగా శంకరప్ప ఎన్నికయ్యారు. ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అమరనాధరెడ్డి, నేతలు రాజారెడ్డి, శ్రీరాములు, కృష్ణారెడ్డి, నౌషాద్, మల్లికార్జున, భాస్కర్‌రెడ్డి, రామాంజులు, ఈశ్వరయ్య, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

హిందూ ధర్మం పాటించండి



సమావేశంలో మాట్లాడుతున్న కార్యవాహ వేణుగోపాల్

పెద్దమండ్యం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) హిందువులు హిందూ ధర్మం, సంప్రదాయాలు పాటించాలని జిల్లా రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ కార్యవాహ వేణుగోపాల్ పిలుపు నిచ్చారు. బుధవారం పెద్దమండ్యంలోని యల్లమ్మగుడి వద్ద హిందూ సంమేళన కార్యక్రమం జరిగింది. అలాగే రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ శత వార్షికోత్సవాలు చేసుకున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సంస్కృతి, ఐక్యత చాటాలన్నారు. హిందూ సమాజాన్ని చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగినట్లు తెలిపారు. నరేంద్రారెడ్డి పాల్గొన్నారు.

డీఎస్పీ కార్యాలయానికి స్థల పరిశీలన



భవనాలను పరిశీలిస్తున్న ఏఎస్పీ వెంకటాద్రి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె డీఎస్పీ నూతన కార్యాలయం ఏర్పాటు కోసం ఎంపిక చేసిన స్థలాన్ని, భవనాలను ఏఎస్పీ ఎం.వెంకటాద్రి పరిశీలించారు. మదనపల్లె పర్యటనలో తాలుకా పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న భవనాన్ని, ఖాళీ స్థలాన్ని ఆయన పరిశీలించారు. తాలుకా, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు కళా వెంకటరమణ, మహమ్మద్ రఫీ, రాజారెడ్డి, ఎస్‌ఐలు చంద్రమోహన్, అన్సర్‌బాషా ఉన్నారు.

ప్రభుత్వ భూములు స్వాధీనం

గాలివీడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గరుగుపల్లి గ్రామంలో ఆక్రమణకు గురైన పిలుగుంట్రరాళ్ల గుట్టను రెవెన్యూ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ, పోలీసు సిబ్బంది స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ భాగ్యలత, ఎస్ఐ రామకృష్ణ గ్రామస్తులతో కలిసి సర్వే నెంబర్ 696లో 3.80 ఎకరాలు, 697లో 5.44 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు కేటాయించారు. అనంతరం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

వాటర్‌షెడ్లతో భూగర్భ జలాలు పెరుగుదల



మొక్కలు నాటుతున్న పీఓ రవీంద్రుడు

పెద్దమండ్యం, డిశంబరు 19(ఆంధ్రజ్యోతి): వాటర్‌షెడ్ నిర్మాణాలతో భూగర్భ జలాలు పెరిగినట్లు వాటర్‌షెడ్ పీఓ రవీంద్రుడు పేర్కొన్నారు. పాపేపల్లి, సి.గొల్లపల్లి గ్రామాల్లో బుధవారం వాటర్‌షెడ్ల మహోత్సవంలో యల్లంవారిపల్లి హైస్కూల్ అవరణలో మొక్కలు నాటారు. అనంతరం ప్రజలు, అధికారులు జల హారతి ఇచ్చారు. పాపేపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాటర్‌షెడ్ల ద్వారా రైతులు శ్రేయస్సు కోరే పనులు జరిగినట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా భూగర్భ జలాలు పెరుగుదలకు దోహదపడినట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ రకాలు అభివృద్ధి పనులు వాటర్‌షెడ్ పథకం ద్వారా జరిగినట్లు చెప్పారు. వాటర్‌షెడ్ జేఈ మోహన్, విశ్వనాథ, శివయ్య, నరసింహులు, రామిరెడ్డి, నాగేశ్వర పాల్గొన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించాలి : టీడీపీ



బాధితుల సమస్య వింటున్న శ్రీరాం చినబాబు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన రామాపురం వాసి ఆవుల నరసింహులు భార్య, పిల్లలకు భరోసా కల్పించాలని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు డిమాండ్ చేశారు. బుధవారం మృతుడి భార్య గ్రామస్థులతో కలిసి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వెంటనే తాలుకా పోలీసులతో మాట్లాడి వారి సమస్యను పరిష్కరించాలన్నారు. వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించాలని ఆయన పోలీసులను కోరారు.